POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఏప్రిల్ 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 41 సంచిక: 12




పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవము

12-04-2024 || 15-04-2024 ( తిథి - చైత్ర శుద్ధ సప్తమి )

# ఈ నెల పండుగలు

ఏప్రిల్ 08 - శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది
ఏప్రిల్ 10 - శ్రీ స్వామి సమర్థ ప్రకటమైన రోజు (తిథి - చైత్ర శుద్ధ విదియ)
ఏప్రిల్ 12 - పూజ్య గురుదేవులు శ్రీ భరద్వాజ మాస్టరుగారి ఆరాధన
ఏప్రిల్ 14 - భగవాన్ రమణ మహర్షి ఆరాధన
ఏప్రిల్ 15 - పూజ్య గురుదేవులు శ్రీ భరద్వాజ మాస్టరుగారి ఆరాధన (తిథి - చైత్ర శుద్ధ సప్తమి)
ఏప్రిల్ 17 - శ్రీరామనవమి
ఏప్రిల్ 17 - శ్రీ సిద్ధారూఢ స్వామి జయంతి (తిథి - చైత్ర శుద్ధ నవమి)
ఏప్రిల్ 30 - శ్రీ ఆనందమయి మాత జయంతి



"ఆకాశం నుండి పడే వర్షపునీరు నదులు, బావులలోని నీరు భగవంతుడిచ్చినదే గదా! అది దివ్యమైనదన్న గుర్తు మనకు లేకపోవడంవల్లనే అది సామాన్యమైన నీరులా ప్రవర్తిస్తుంది. అది దివ్యమైనదని గుర్తుంచుకొనడమే సాధనంతా. అపుడు మన అజ్ఞానమనే పొర మన కండ్లపై నుండి తొలగి మనకు వాటి దివ్యత్వమనుభవమవుతుంది. ఇదే నిజమైన ఆధ్యాత్మికత."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# శ్రీరామునివలె ధర్మాన్ని ఆశ్రయించాలి!

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

రామాయణము, భారత భాగవతకథ యదార్థంగా జరిగాయనీ, తాము స్వయంగా చూచామని శ్యామాతో సాయిబాబా చెప్పారు. అంతేగాక ఒక భక్తురాలితో "రాజారామ్, రాజారామ్" అని ఎప్పుడూ అనుకొంటుండమని, మరొక భక్తునితో "శ్రీరామ్, జయ రామ్, జయ జయ రామ్" అనుకొంటుండాలని సాయి అన్నారు. అంటే రాముడు భగవంతుడని ఆయన చెప్పినట్లే. కనుక పైన చెప్పిన సద్గ్రంథాలలోని ధర్మసూత్రాలను ఆయన ఆమోదించినట్లే. మనకు లభ్యమయ్యే గ్రంథాలలో ప్రక్షిప్తమైన భాగాలేవో చెప్పమని ఎవరైనా కోరితే ఆయన ఏమి చెప్పేవారో తెలియదు గనుక సాయి బోధలకు విరుద్ధముగాని ఆ గ్రంథాలలోని ధర్మాలను మన ఆశ్రమానికి తగినవి మనమాచరించ వలసిందే.

జీవితంలో అడుగడుగునా ధర్మము – అధర్మము, సత్యము – అసత్యము ఎదురౌతూనే వుంటాయి. వ్యక్తులపై మమకారం వలన అధర్మాన్ని, అసత్యాన్ని ఉపేక్షిస్తే రావణాసురుడు, ధృతరాష్ట్రుడు చేసిన పొరపాటే మనము చేసినవారమవుతాము. అధర్మం జరుగుతుంటే చూస్తూ వూరుకున్నవారికి దానికి దోహదం చేసిన దోషమే సంక్రమిస్తుంది. శక్తివంచన లేకుండా దానిని ఎదుర్కొని ఖండించడము – విభీషణుడు చేసినట్లు చేయడము ధర్మాచరణలో భాగమే. వ్యక్తిగతమైన కృతజ్ఞతతోనూ, మమకారంతోనూ దానిని ఉపేక్షించిన వారికి భీష్ముడు, ద్రోణుడు మొదలైన వారికివలె వినాశం తప్పదు. ఇవే ఆ సద్గ్రంథాలు మనకు బోధించే ఉత్తమ ధర్మసూత్రాలు. అట్టి ప్రయత్నంలోనే జటాయువు మోక్షానికి అర్హుడయ్యాడు. అధర్మాన్ని ప్రతిఘటించటంలో వెనుదిరుగక ప్రాణమర్పించిన వాని ఆత్మ – యోగనిష్ఠలో ప్రాణం విడచి సూర్యమండలాన్ని భేదించుకుపోయిన యోగియొక్క ఆత్మవలె – జన్మ రాహిత్యం పొందుతుందని మన శాస్త్రం చెబుతుంది.

అందుకే తమ సేవకుడైన కాశీరాం షింపీపై దొంగలు పడినపుడు అతడు వారితో యథాశక్తి పోరాడుతుంటే ద్వారకామాయి మసీదులో సాయిబాబా ఎవరితోనో యుద్ధం చేస్తున్నట్లు భంగిమలు చేస్తూ "కొట్టు, చంపు!" అని కేకలు వేశారు. కాశీరాం యిద్దరు దొంగలను చంపాక గొడ్డలి దెబ్బకు స్పృహ కోల్పోయాడు. అతడు మరణించాడని తలచి మిగిలిన దొంగలు పారిపోయారు. అతడు తిన్నగా శిరిడీలో మశీదు చేరేసరికి, అచటి భక్తులతో సాయి, "నేను రక్షించకుంటే యితడు చనిపోయేవాడే!" అన్నారు. అంటే అతడికి మరణము తప్పించి అతడికి తగిలిన దెబ్బ ద్వారా దుష్కర్మ ఫలాన్ని తప్పించారని అర్థము.

ఇలా అధర్మాన్ని వ్యతిరేకించక బంధు ప్రీతితోను, పక్షపాతంతోను, పాండవులపై అసూయతోను అధర్మపరులైన కౌరవుల పక్షాన్ని ఎందరో రాజులు వహించటం వలన పాండవులెంతో కాలం కష్టాలను అనుభవించవలసి వచ్చింది. కాని అధర్మాన్ని ఉపేక్షించి వారు బలపర్చడం వలన అలా చేసిన వారందరూ అత్యధిక సంఖ్యలో కురుక్షేత్రంలో నశించవలసి వచ్చింది. శ్రీ సాయియొక్క పూర్వరూపమైన అవధూత తన గురువులలో ఒకటి సముద్రమని చెప్పి దాని నుండి తాను నేర్చిన దానిని (భాగవతము, ఏకాదశ

***మిగతా 12వ పేజీలో***

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 ఏప్రిల్ - 2024 సంచిక:12

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | శ్రీరామునివలె ధర్మాన్ని ఆశ్రయించాలి! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | నిస్వార్థతకు నిలువెత్తు నిదర్శనమే శ్రీ భరద్వాజ గురుదేవుల దివ్యచరితం | శ్రీమతి శ్రీదేవి | 09 |
| 05. | మాతృదేవి స్మృతులు | శ్రీ మనోజ్ | 13 |
| 06. | పూజ్య గురుదంపతుల కల్యాణ వైభోగ మహోత్సవం!! | శ్రీమతి టి.పద్మావతి | 14 |
| 07. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 16 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 20 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 10. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 24 |
| 11. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి స్వాతి | 25 |
| 12. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి శేషమ్మ | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

**ప్రశ్న :- అన్ని సంస్కారాలలాగే హృదయ పూర్వకమైన భక్తిగూడా పూర్వజన్మ సుకృతమేమో, లేకుంటే మీవంటి వారికి మొదటి దర్శనంలోనే అంతటి అనుభవము, ప్రశాంతత కల్గడము, నావంటివారు నిత్యదర్శనము చేస్తున్నా భక్తి గూడ మిగిలిన భావాల లాగే తాత్కాలికము మాత్రమే అవడమేమి? అలా అయితే సాయి కోరిన నిష్ఠ, సబూరీలను అర్పించడం మన చేతులలో ఏమున్నది.**

**- ఒక పాఠకురాలు, హైదరాబాదు**

**జవాబు** :-అన్ని సంస్కారాల వలె భక్తికూడ పూర్వజన్మ సుకృతమే. పూర్వజన్మ సుకృతమంటే వెనుకటి జన్మలలో మనం చేసుకున్న మంచి యొక్క ఫలితమే. కనుక ఈ జన్మలో మనము శక్తినంతా వినియోగించి కృషిచేసి అట్టి ఫలితాన్ని పొందగలగడం మన చేతులలోనే వుంది. అందుకే "ఉద్ధరేదాత్మనాత్మానాం" - "తనను తానే ఉద్ధరించుకోవాలి" అని భగవద్గీత చెప్పింది. కానీ సాయి చెప్పినట్లు "ఈ మార్గంలో పయనించడం దున్నపోతునెక్కి నాన్వేఘాట్ దాటటంకంటే కష్టం". మన శక్తినంతా వినియోగించి కష్టపడితేగాని ఫలితముండదు. మన యత్నం చాలినంత తీవ్రంగా జరిగితే ఫలితం ఈ జన్మలోనే కన్పించవచ్చుగూడ. ఇది స్వానుభవము. 1955 సం॥లో నా ఉపనయనానికి దైవజ్ఞులు పెట్టిన ముహూర్తబలం, ఆ క్రతువులోని వేదమంత్రాలు, మా పెద్దన్నగారి పూజలు, ఉపవాసాలు వారి అబ్బాయిని రక్షించలేకపోవడం చూచి తీవ్రమైన నాస్తికభావం, అంతకంటే గూడ అన్వేషణ నాలో మేల్కొన్నాయి. నిరంతరము జీవితపరమావధి, చావు పుట్టుకల తత్త్వము, ఆత్మ-అనాత్మల గురించి తీవ్రంగా దృఢంగా 1961 వరకూ ఆలోచన కొనసాగింది. రాత్రిళ్ళు 3, 4 గంటలకంటే నిద్ర యెరుగను. వ్యక్తిగతమైన అభిమానంతో ఏ గురువుకూ తలతాకట్టు పెట్టుకొనలేదు. గుడ్డిగా ఎవరు చెప్పినదీ అనుసరించలేదు. ఆధునిక విజ్ఞానం అధ్యయనం చేసి చివరకు ఆస్తికభావం కలిగినా, సాధనమార్గం గూడ ఎవరు చెప్పినా అనుసరించలేదు. తెలిసో తెలియకో చేసిన ఆ కృషి ఫలితమే శిరిడీలో సాయి నిరంతరమూ వర్షిస్తున్న అనుగ్రహానికి పాత్రుణ్ణి చేసింది. అట్టి జిజ్ఞాసలో ఏ ఉద్యోగమూ నన్ను ఆకట్టుకోలేకపోయింది. అయితే అన్నగారి అబ్బాయి చనిపోయినప్పుడే, అందరివలె శోకించి కొద్దికాలానికి బాధ మరచిపోకుండా చేసింది సుకృతమే కావచ్చు. సద్గురువుయొక్క అనుగ్రహము ఎప్పుడూ మన సుకృతం వలన- అంటే తీవ్రమయిన కృషివలన సార్థకమవుతుంది. అట్టి కృషి ఫలితంగానే తర్వాత గూడ ఎవరో శ్రమించి వ్రాసిన గ్రంథాలలోని విషయాలను నేర్చుకున్నా ఆ విషయం రచనలో ప్రకటించనిదే మనశ్శాంతి వుండదు. ●

(ఫిబ్రవరి 2016 సాయిబాబా మాసపత్రిక నుండి)

# ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

మహాత్ముల జీవితాలు విభిన్నముగా వుంటాయి. వారందరూ అనుభవించేది ఆత్మానందమే అయినప్పటికీ ఒక్కొక్కరి చర్యలు ఒక్కొక్క రకముగా వుంటాయి. వారందరి సన్నిధిలోనూ ఎన్నో లీలలు, ఎన్నో అద్భుతాలు, మరెన్నో వింతలు జరుగుతూవుంటాయి. ఇవి సామాన్యంగా మహాత్ములందరి దగ్గర తప్పక జరుగుతాయి. అయినప్పటికీ వారి జీవిత విధానము మాత్రము వేరుగా వుంటుంది. శ్రీసాయినాథులు ఫకీరులా జీవించారు. పంచభిక్షలతో జీవనము గడిపారు. శ్రీ నృసింహసరస్వతీస్వామి శాస్త్రవిధి ననుసరించి సన్యాసిగా జీవించారు. అలాగే శ్రీ మాణిక్య ప్రభువు యొక్క జీవితము ఒక రకంగా వుంటే శ్రీ అక్కల్ కోట స్వామి జీవన విధానము మరొకవిధంగా వుంటుంది. అలాగే శ్రీ తాజుద్దీన్ బాబా, ధునీవాలా దాదా జీవితాలు కూడా విభిన్నంగా వుంటాయి. అలాగే వారి దినచర్యలు కూడా వేరువేరుగా వుంటాయి. వారు ఉదయము నిద్రలేచిన దగ్గరనుంచి రాత్రి పడుకోబోయే వరకూ గడిపే విధానాన్ని గమనిస్తే వారు లోకాన్ని వుద్ధరించే తత్వము మనకు అవగతమౌతుంది.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు సామాన్య మధ్యతరగతి గృహస్థులా జీవించారు. కానీ ఆయన సన్నిధిలో ఎన్నెన్నో అద్భుతమైన లీలలు జరిగాయి. ఎంతోమంది ఆయనవల్ల లౌకిక శ్రేయస్సు పొందారు. మరెంతోమందికి ఆధ్యాత్మిక శ్రేయస్సుకూడా లభించింది. ఇంకా ఆయన దగ్గర జరిగిన వింతలు, విశేషాలు ఎన్నో, ఎన్నెన్నో!

పూజ్యశ్రీ మాస్టరుగారిని భౌతికంగా దర్శించని వారిలో చాలామంది ఆయన నిరంతరము బాబా ధ్యానములోనో, స్మరణలోనో గడుపుతూ వుండేవారని, వచ్చినవారితో బాబా గురించి మాట్లాడుతూ, వుపన్యాసాలిస్తూ, గ్రంథాలు రచిస్తూవుండేవారని అనుకుంటారు. అది నిజమే అయినప్పటికీ ఆయన యింకా ఎన్నో పనులు చేసేవారు. ఒకే సమయంలో ఎన్నో పనులను సమర్థవంతముగా నిర్వర్తించటము ఆయనలోని విశిష్టత. 'కర్మ సుకౌశలమ్' అనే వాక్యానికి ప్రత్యక్ష వ్యాఖ్యానము ఆయన. 'అదేమిటి? ఆయన అలా ఎలా వుండేవారు?' అని కొందరికి సందేహము కలగడం సహజమే. అందుకే ఆయన సన్నిధిలో ఒక రోజు ఎలా గడిచిందో వుదాహరణకు యిప్పుడు చెప్పుకుందాము.

అది పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ మాస్టరుగారి సన్నిధిలో ఒకరోజు. ఆయన వుదయం గం॥4-30ని॥లకు నిద్రలేచారు. కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ త్రాగి సత్సంగ

హాలులోకి వెళ్ళి హారతికి కూర్చున్నారు. ప్రతిరోజు హారతి పుస్తకం చూసి మాత్రమే చదివేవారు. "అలా రోజూ పుస్తకం చూసి చదవడం ఎందుకు? ఇన్ని సంవత్సరాలుగా ఆరతి చేస్తున్నపుడు నోటికి వచ్చి వుంటుంది కదా?" అని అడిగితే ఆయన యిలా చెప్పారు, "నాకు అలా గుర్తుండవు. నేను ఆయనను (బాబాను) భావన చేస్తూ చదువుతాను. అలా భావన చేస్తూవున్నప్పుడు చరణంలోకి మనస్సు వెళ్ళదు. అంతేగాక ఎప్పుడూ ఒకే భావం కూడా వుండదు. ఆయనను గూర్చి లోపల యింకా లోతుగా భావపరంపరలు దొర్లిపోతుంటాయి. అందుకే పుస్తకం చూస్తూ వుండేది. నాకు ఆరతులు యింకా మొదటిసారి పాడినట్లుగానే అనిపిస్తుంది."

అయినప్పటికీ ఆయన పుస్తకం చూస్తూనే బాబాను కూడా ఆర్తితో, భక్తి భావంతో చూస్తూవుండేవారు. ఒక్కొక్కసారి ఆయన కంఠం గద్గదమయ్యేది కూడా!

ప్రతిరోజు ఆరతి అయిన తర్వాత అందరికీ ఊదీ యిచ్చి చక్కెర ప్రసాదం పెట్టేవారు. యింట్లో జరిగే ఆ ఆరతికి యింట్లోనివారు, అప్పుడు యింటికి వచ్చివున్నవారు హాజరయ్యేవారు. చుట్టుప్రక్కలవారు వచ్చేవారు కారు. ఏమి ఆర్భాటాలు లేని అతి నిరాడంబరంగా జరిగే ఆ ఆరతికి ఎక్కువమంది ఎలా రాగలరు? చుట్టుప్రక్కల గుడిసెలలో వుండే పిల్లలు మాత్రమే వచ్చేవారు. అయినా పూజ్యశ్రీ మాస్టరుగారు వారికి యిలా వుండాలని గాని, యిలాగే రావాలనిగాని ఎన్నడూ చెప్పేవారు కాదు. కాని ఆరతి జరిగేటప్పుడు ఆ పిల్లలను అప్పుడప్పుడూ గమనిస్తూ వుండేవారు. వారికి నిద్రతూగితే తన దగ్గరవున్న అగ్గిపెట్టెను గలగలమనిపించడం గాని, వ్రాసుకునే బల్లమీద చేత్తో శబ్దం చేయడంగాని చేసేవారు.

ఆ పిల్లలు కేవలం పూజ్యశ్రీ మాస్టరుగారు పెట్టే చిటికెడు చక్కెర కోసమే వస్తున్నారని ఒకరు అభిప్రాయము వెలిబుచ్చినప్పుడు ఆయన యిలా చెప్పారు: "కేవలం ప్రసాదం కోసము అయితే వాళ్ళు తెల్లవారుఝామున లేచి రావలసిన అవసరం లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు రకరకాల ప్రసాదాలు వారికి యిక్కడ లభిస్తూనే వుంటాయి. అయినా పెద్దవారికి కూడా లేని ఆసక్తి – అంటే ఆరతికి హాజరు కావాలనే ఆసక్తి వీరికి ఏ కారణం చేతనైనా వుండడం విశేషమే కదా! ఆ కొద్ది చక్కెర కోసం తెల్లవారుఝామున నిద్రలేచి బాబా సన్నిధికి రావాలనే సంకల్పం యీ వయస్సులో కలగడమే విశేషం. అది చాలు బాబాకి, ఆయన ప్రేమను వర్షించడానికి!"

నిజమే! ఆనాడు పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలో ఆయన తమ మధురగళముతో ఆలపించిన ఆరతిని వినని, ఆయన బాబాకు నివేదించిన ప్రసాదాన్ని స్వీకరించనివారు ఎంతటి అదృష్టాన్ని కోల్పోయారో అని ఈనాడు సశరీరంగా ఆయనను దర్శించలేనివారు తప్పక భావిస్తారు. అది నిజంకూడా! కానీ ఎవరి ప్రాప్తాప్రాప్తాలను బట్టి అట్టి అదృష్టం వారికి లభిస్తుంది.

ఆ రోజు యింట్లో వారు, ఆ పిల్లలు తప్ప ఎవరూ లేరు. ఆ రోజు ఆరతికి వచ్చిన పిల్లల్లో రెండు సంవత్సరాల పిల్లకూడా వున్నది. అది తరచూ ఆరతికి వస్తూనే వుండేది. అప్పుడే నిద్రలేచిందేమో! చింపిరి జుట్టుతో చొంగచారికలు, కళ్ళలో పుసులతో అర్ధనగ్నంగా వున్నది. అసలే నల్లని పిల్లేమో, చూడడానికి కొంత అసహ్యంగా కనిపించడం సహజమే. పూజ్యశ్రీ మాస్టరుగారికి పిల్లలంటే ఎంతో ముద్దు. అలా చింపిరిగా వున్న ఆ పిల్లంటే ఎంతముద్దో! దానికి కొంత అల్లరి, కొంత పెంకితనమూ కూడా వున్నాయి. ఆరోజు అది మాస్టరుగారు – యిస్తున్న చక్కెర ప్రసాదాన్ని తీసుకోలేదు. "ప్రసాదం వద్దా? మరేమి కావాలి నీకు?" అన్నారు మాస్టరుగారు. "చాక్లెట్" అని ముద్దు మాటలతో చెప్పింది ఆ పిల్ల. "మరి చాక్లెట్ లేదు కదా! చక్కెరే తీసుకో. మళ్ళీ యిస్తాలే!" అన్నారాయన. "కాదు నాకిప్పుడే కావాలి" అని మారాం చేసింది ఆ పిల్ల. అది గోముగా చేసే మారాం చూసి ఆయనకు ఎంతో ముచ్చటేసింది. గబుక్కున దానిని దగ్గరకు తీసుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నారు. ఆ పిల్లను ముద్దుచేస్తూ, "ఇప్పుడే కావాలా? యిప్పుడే కావాలా? అని నవ్వుతూ 'చాక్లెట్లేమైనా వున్నాయా?' అని యింట్లోకి కబురు పెట్టారు. చాక్లెట్లు తెచ్చేలోపల దానితో ఎన్నో మాటలు మాట్లాడుతూ ముద్దుచేస్తూ వున్నారు. దుమ్ముపట్టి మురికిగా వున్న శరీరం, వాసన కొడుతున్న నోరూ, అసహ్యకరముగా వున్న ఆ పిల్లను అలా ముద్దుచేస్తుంటే నాకు ఎంతో ఆశ్చర్యమనిపించింది. ఆ పిల్లకు, తమ పిల్లలైన చిరంజీవులు వేదవతి, ద్వారకలకు ఆయనకు భేదమే లేనట్లు నాకు అనిపించింది. సకల జీవులకు తండ్రి అయిన ఆయనకు తన పిల్లలు, పరాయివారు అన్న భేదమెందుకుంటుంది? ఆ

తర్వాత ఆయన ఆ చాక్లెట్లు ఆ పిల్లకేగాక మిగతా పిల్లలకు కూడా యిచ్చారు. ఆ పిల్లలందరూ ఎంతో సంతోషంతో గంతులువేస్తూ వెళ్ళిపోయారు. వారెంత అదృష్టవంతులో కదా!

ఆ తరువాత ఆయన ఊదీ కొద్దిగా నుదుట పెట్టుకొని, నోట్లో వేసుకుని చక్కెర ప్రసాదం కొద్దిగా తీసుకున్నారు. చిన్న పళ్ళెంలో కొద్దిగా ఊది, చక్కెర ప్రసాదం వేసి నాకు లోపలికి పంపించారు. ఆ తర్వాత మళ్ళీ కాఫీ తీసుకున్నారు. ఆయనకు కాఫీ బాగా అలవాటు. రోజుకు చాలాసార్లు కాఫీ సేవించేవారు. ఆ తర్వాత పత్రికకు వ్యాసాలు వ్రాస్తూ కూర్చున్నారు.

అప్పటికి సమయం, ఉదయం 7గం॥ దాటుతున్నది. ఆయన చిరంజీవులు వేదవతి, ద్వారకలను చదువు చెప్పడానికి పిలిచారు. ఇద్దరికీ ఒక గంట సేపు పాఠాలు చెప్పారు. ఆ రోజు ద్వారకకు సైన్సులో విత్తనాలు, మొక్కల గురించి చెబుతున్నారు. అప్పుడాయన పిల్లలిద్దరినీ పెరట్లోకి తీసుకుని వెళ్ళి మొక్కలను చూపిస్తూ అవి మొలకెత్తడం, పెరగడం గురించి వివరించారు. ఇంతలో ఎవరో భక్తులు వచ్చి హాలులో కూర్చున్నారు. పిల్లలను పంపివేసి వచ్చినవారితో కొద్దిసేపు మాట్లాడారు. వాళ్ళు వెళ్ళిపోగానే మళ్ళీ వ్యాసం వ్రాస్తూ కూర్చున్నారు. కొంచెంసేపు తర్వాత మరికొందరు వచ్చి తమ ఊరిలో సాయిబాబా మందిరం కట్టదలచుకున్నామని చెప్పి ఎలా కట్టాలో సలహా యివ్వవలసినదని ఆయనను ప్రార్థించారు. ఆయన వారిని వివరాలు అడిగి తగిన సలహా యిచ్చారు. వారితో ఆయన యింకా యిలా అన్నారు: "మందిరం కట్టడం చాలా సులభమే, కాని తరువాత మందిరాన్ని ఎలా నిర్వహించుకోవాలో చాలామందికి తెలియడంలేదు. మందిరంలో ప్రతిరోజూ నాలుగు ఆరతులూ జరగాలి. అభిషేకము, పూజాది కార్యక్రమాలు తప్పక జరగాలి. ప్రతిరోజూ సాయంత్రం బాబా చరిత్ర పారాయణం చెయ్యాలి. ప్రతి గురువారమూ పల్లకి ఉత్సవం చేయాలి. ధునిని కూడా నిర్వహించాలి. శిరిడీలో వలెనే ప్రతి మందిరంలోనూ యివన్నీ తప్పక జరగాలి. అప్పుడు అందరికీ శ్రేయస్సు కలుగుతుంది. బాబా లీలా శ్రవణం వల్ల ప్రజలలో ఆయనపై భక్తి ప్రజ్వరిల్లుతుంది.

అంతేకాదు, యీ రోజుల్లో చాలాచోట్ల మందిరాలలో రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. అందరూ కలిసి పనిచెయ్యడం కాక ఒకరికొకరికి పడకుండా ఒకరిపై ఒకరు ద్వేషాలను పెంచుకుంటున్నారు. అందువలన పోట్లాటలు, కొట్లాటలు జరుగుతున్నాయి. ఆ కారణంగా అక్కడ ప్రశాంతత లోపిస్తున్నది. మందిరాలలో అలా ఎన్నటికీ జరుగకూడదు. అందరూ సమన్వయంతో కలిసి పనిచెయ్యాలి. ఇది గుర్తుపెట్టుకోవడం ఎంతో ముఖ్యం" అని చెప్పారు. అందుకు వారెంతో సంతోషించి చాలా మంచి విషయాలు తెలియజెప్పారని మాస్టరుగారిని ప్రశంసించి సెలవు తీసుకున్నారు.

వీరితో మాస్టరుగారు మాట్లాడుతూ వుండగానే మరికొందరు భక్తులొచ్చారు. మందిరం తాలూకు వారిని పంపించి మిగిలినవారితో కొద్దిసేపు వారి సమస్యల గురించి మాట్లాడారు. వారు వెళ్ళిపోయాక లోపలికి వచ్చి ఫలహారం చేశారు. అప్పటికి వుదయం దాదాపు 10 గం॥లు అయింది. ఫలహారం చేస్తున్నప్పుడు యింటి విషయాల గురించి, పిల్లల మందుల గురించి మాట్లాడారు. అప్పుడు కొన్ని హాస్య సంభాషణలతోనూ, నవ్వులతోనూ కాలం గడిచింది. తరువాత ద్వారకకు ఆటలపై ఆసక్తి గురించి, చదువుమీద ధ్యాస లేకపోవడం గురించిన విషయం తలెత్తింది. అప్పుడాయన యిలా అన్నారు: "ఈ వయస్సులో పిల్లలెవ్వరికీ చదువుపై ఆసక్తి వుండదు. ఎంతసేపటికీ ఆడుకోవాలనే అనిపిస్తుంది. అది వారి ఆరోగ్యానికి, మానసిక వికాసానికి మంచిది కూడా. అయితే చదువు అవసరం లేదని నేననడంలేదు. ఆటల ద్వారానే వాళ్ళకు ఎంతో విద్యను నేర్పించవచ్చు. ఇప్పుడు జరుగుతున్న విధంగా బడికి పంపించడమనేది చాలా ఘోరమైన విషయం. వాళ్ళ మానసిక పరిధిని కొద్ది విజ్ఞానం వరకే కుదించి చెప్పడం, ఆ విషయాలను కూడా వారికి అర్థమయ్యేలా తెలియజేయడం కాకుండా జవాబులను బట్టీ కొట్టించడం జరుగుతున్నది. పాఠం మొత్తం కూడా వారికి తెలుసుకునే అవకాశం లేదు. పాఠం మొత్తంలో రెండు మూడు ప్రశ్నలను కేవలం వాక్యాలను గుర్తుపెట్టుకోవడంగా మాత్రమే చేయడం జరుగుతుంది. అది కూడా పరీక్షలకు సంసిద్ధం చేయడానికి మాత్రమే. ఇక వారికి చదువుపట్ల ఆసక్తి ఎలా వుంటుంది?

**- సశేషం**

# నిస్వార్థతకు నిలువెత్తు నిదర్శనమే శ్రీ భరద్వాజ గురుదేవుల దివ్యచరితం

***శ్రీమతి శ్రీదేవి***

ఈ భూమిపై యీ కలియుగంలో యెందరో మహాత్ములు అవతరించారు. వీరంతా మాయాబద్ధులయిన మానవుల అజ్ఞానం తొలగించి, వారిని ఆత్మపథం వైపు మరలించాలనే సంకల్పంతో వచ్చిన వారే!

సద్గురువు సాక్షాత్తు భగవంతుడే. ఆ సద్గురువు అనంత శుభ గుణ సంపన్నుడు. నిజానికి రూపరహితుడైన, గుణరహితుడైన ఆ భగవంతుడు మనకోసమే సకల సద్గుణ శోభితుడై మానవాకారంలో అవతరిస్తాడు. మానవాళిని శుభ్రమార్గంలో నడిపించటానికే ఆయన సద్గుణములతో అలరారుతూ వుంటాడు. సమస్త సద్గుణ సంపన్నుడైన ఆ సద్గురువు తన యొక్క సత్ప్రవర్తనతో జనులకు ఆదర్శప్రాయుడై నిలుస్తాడు.

జ్ఞానము, వైరాగ్యము, ధర్మము, భూతదయ, తపస్సు, శాంతి, ప్రేమ, క్షమ, త్యాగశీలత వంటి అనేక శుభగుణ సంపన్నుడైన ఆ సద్గురువును కీర్తించటానికి వేయి నాలుకలు కూడా సరిపోవు. అయినా మనకు తోచినంతవరకు ఆయనలోని శుభగుణాలను మన శక్తి మేరకు స్మరించుకొని ధన్యులమౌదాము.

ఈ వ్యాసంలో శ్రీ భరద్వాజ గురుదేవులలోని "నిస్వార్థ తత్త్వం" అనే ఒకశుభ గుణం గురించి నా అవగాహనకు అందినంత మేర విశ్లేషించ దలచాను.

సాధారణంగా మహాత్ముల జీవనశైలి సామాన్య మానవుల జీవితాలతో పోలిస్తే చాలా విభిన్నంగా వుంటుంది. ఎక్కువ మంది సద్గురువులు, మహాత్ములు సంసారమంటని విరాగులుగా సాధుజీవనం గడుపుతుంటారు. గృహస్థులుగా జీవించే కొందరు గురువులు, మహాత్ములు కూడా సాధారణ మానవుల వలె కాక విభిన్న జీవన శైలిలో జీవనం సాగిస్తుంటారు. శ్రీ భరద్వాజ మాస్టరుగారి విషయానికి వస్తే ఆయన బ్రహ్మచారిగా వున్నప్పుడు, గృహస్థాశ్రమం స్వీకరించిన తర్వాత కూడా అంతరంగంలో విరాగిగా వుంటూనే బాహ్యంగా సాధారణ మానవుడు యెలా జీవనం సాగిస్తాడో అదే విధంగా అతి నిరాడంబరంగా జీవించారు. అయితే శ్రీ భరద్వాజ మాస్టరుగారు యోగి, అవతారపురుషుడు అయివుండికూడా సాధువువలె జీవించక సామాన్య మానవుని వలె జీవించటానికి కారణం మేమిటి? – అని ఆలోచిస్తే ఒక విషయం స్పష్టమౌతుంది.

విదేశీయుల కుతంత్రాలవలన, కలియుగ ప్రభావం వలన ప్రజలలో దైవభక్తి, ధర్మచింతన తగ్గిపోవటమే కాకుండా ముఖ్యంగా మన దేశంలో యెంతగానో గౌరవింపబడే ధర్మప్రబోధకులయిన సాధు సన్యాసులు, గురువులు, మహాత్ముల వంటి వారిపట్ల ప్రజలకు భక్తి గౌరవాలు తగ్గి, చులకన భావం యేర్పడటంతో సద్గురువుల బోధల పట్లకూడా ప్రజలకు భక్తిశ్రద్ధలు నశించిపోవటం

జరిగింది. అందువలన శ్రీ భరద్వాజ మాస్టరుగారు సాధు సన్యాసుల వలె ప్రత్యేకంగా జీవించక సాధారణ మానవులతో మమేకమై జీవిస్తూ ప్రజలకు ఆధ్యాత్మిక బోధలు చేశారు.

శ్రీ భరద్వాజ మాస్టరుగారు శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యుల వారికి నాల్గవ కుమారుడుగా జన్మించారు. శ్రీ అనంతాచార్యులవారు గొప్ప తపస్సంపన్నులు, యోగి పురుషుడు అయినప్పటికీ ఆధునిక విద్యలు కూడా అభ్యసించి, ఆ రోజుల లోనే మద్రాసు కళాశాలనుండి ఎమ్.ఎ., పట్టా పుచ్చుకొన్నారు. ఆ విధంగా ఆధ్యాత్మికతతో పాటు ఆధునికతను కలబోసుకున్న కుటుంబంలో శ్రీ భరద్వాజగారు జన్మించారు. బాహ్యంగా గృహస్థాశ్రమంలో వున్న శ్రీ అనంతాచార్య అంతరంగంలో నిరంతర యోగ నిష్ఠాగరిష్టులుగా వుండేవారు. ప్రత్యేక వేషధారణమేమీ లేకుండా వేషభాషలలో అతి నిరాడంబరంగా వుంటూ యెన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేసేవారు. శ్రీ భరద్వాజగారు కూడా తండ్రి వలెనే వున్నత విద్యల నభ్యసించి, ఇంగ్లీష్ ఎం.ఎ. చదివి కళాశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పని చేశారు. వీరు కూడా నిరాడంబర జీవితం గడుపుతూ ప్రజలలో మమేకమై జీవించారు.

కలియుగంలో అవతరించిన అపరదత్తాత్రేయుడు శ్రీ భరద్వాజ గురుదేవులు సామాన్యునివలె కాలేజీ చదువులు చదవటం, ఉపాధ్యాయునిగా పనిచేయటం చిత్రంగా వుంటుంది.

ఇటువంటి లౌకిక విద్యలతో ఆయన కేమిపని? బ్రహ్మవిద్యయే ఆయన సొంతం అయివుండగా యీ ప్రాపంచిక విద్యలు ఆయనకు తెలియనివి కావుకదా? ఆయన యొక్క అపార మేధస్సు ఆయన కావాలనుకుంటే ఆయనను అపర కుబేరునిగా చేయగలదు. అయినా ఆయన కలెక్టరు వంటి వున్నత పదవులను కూడా కాదని ఒక చిన్న కళాశాల ఉపాధ్యాయునిగా పనిచేశారు.

ఆ ఉద్యోగం ద్వారా వచ్చే కొద్ది వేతనంతోనే అతి నిరాడంబరంగా జీవించారు. తన స్వార్థం చూసుకొనకుండా అద్భుతమైన సాధుజీవితాన్ని త్యజించి మనలో మమేకమవటం కోసం ప్రాపంచికుల వలె జీవించారు.

యుక్తవయస్సు నుండే అందరి యువకులవలె సరదాలకు, విలాసాలకు శ్రీ భరద్వాజ మాస్టరుగారు ఆకర్షితులు కాలేదు. తాము ధర్మమార్గంలో నడుస్తూ తమ వద్ద విద్యనభ్యసించే విద్యార్థులకు, ప్రజలకు ఆధ్యాత్మికతను బోధించారు. హైదరాబాద్ లోని వివేకవర్ధనీ కళాశాలలో పనిచేస్తున్న కాలంలో నవ యువకులైన అనేకమంది విద్యార్థులను భక్తిమార్గంలో నడిపించారు. ఆ విద్యార్థులు శ్రీ మాస్టరుగారి బోధలకు ఆకర్షితులై తమయిండ్లను వదలి శ్రీ మాస్టరుగారి యింటికి వచ్చి వారితోనే వుండటం ప్రారంభించారు. నిరంతరం శ్రీ భరద్వాజగారి సాన్నిధ్యంలో వుండటం వలన తమకు ఐహిక ఆధ్యాత్మిక శ్రేయస్సు చేకూరగలదని ఆ విద్యార్థుల విశ్వాసం.

శ్రీ భరద్వాజ గురుదేవులు తమ అన్నగారైన శ్రీ వేదవ్యాసుగారితో కలసి కొంతకాలం 'కృతయుగ' అనే ఆధ్యాత్మిక పత్రిక నడిపారు. ఆ పత్రిక ద్వారా అనేకమంది శ్రీ భరద్వాజగారి బోధలకు ప్రభావితులై ఆధ్యాత్మిక సాధకులుగా మారిపోవటం జరిగింది. ఇలా ఆయన ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడచి తరించాలనే తపనతో నిరంతరం అందరికీ భక్తి ప్రబోధం చేస్తుండేవారు. కుటుంబంలోని పిల్లలను సైతం దైవచింతన వైపు మరలించటానికి కృషి చేసేవారు.

24 సం॥ల వయస్సులో శిరిడీ సాయినాథుని సన్నిధిలో ఆయన పొందిన బ్రహ్మానుభూతితో ఆనాటినుండి ఆయన అవతార ఉద్దేశం సంపూర్ణంగా కార్యరూపం దాల్చింది. అప్పటినుండీ తమయొక్క తను, మనో, ధవాలను ప్రజోద్ధరణకే అర్పించి, ఆ లక్ష్య సిద్ధికోసం అలుపెరగని ప్రయాణం సాగించారు శ్రీ మాస్టరు గారు.

శ్రీ భరద్వాజగారు యెందరో మహాత్ములను దర్శించారు. అయితే ఆయన యెలాంటి కోరికలతో వారిని దర్శించి వుంటారు? ఏమి ఆశించి దర్శించారు? భగవంతునికి కోరికలు, ఆశలు వుంటాయా? శ్రీ మాస్టరుగారు కోరికలు తీర్చి ఆపదలను బాపి కాపాడే కల్పవృక్షంగా నిలచి అసంఖ్యాక భక్తులకు యెన్నో అనుభవాల నిచ్చారు. కాబట్టి ఆయనకు వున్నది ఒకే కోరిక అని మనం తెలుసుకొనాలి. మహాత్ముల సందర్శనం, వారి ఆశీస్సులు ప్రజలకు

యెంతో మేలు చేకూర్చుతాయి – అనే విషయాన్ని ప్రజలకు తెలియజెప్పి, వారిని దర్శించేలా చేయాలన్నదే ఆయన కోరిక. ఒక తండ్రి తన బిడ్డల కోసం యెంతగానో శ్రమించినట్లే, శ్రీ భరద్వాజ మాస్టరుగారు మహాత్ములను ముందుగా తాను దర్శించి, సేవించి అందరికీ ఆదర్శంగా నిలచారు. అందుకోసం యెంతో శ్రమించారు. సెలవుదినాలలో, చివరకు శని, ఆదివారపు సెలవులలో సైతం విశ్రాంతి తీసుకొనకుండా, నిద్రాహారాలను, శ్రమను లెక్కచేయక మహాత్ముల వద్దకు వెళ్తుండేవారు. వారి కోసం దూరదూర ప్రాంతాలకు కూడా పర్యటించి దర్శించేవారు. నైమిశారణ్యంలో శ్రీ ఆనందమయి అమ్మ దర్శనార్థం వెళ్ళి, యెముకలు కొరికే చలిలో పైన ఎటువంటి ఆచ్ఛాదనా లేని మైదానంలోను, చెట్టుక్రిందను వుంటూ, సరియైన తిండి, నీరు, నిద్ర లేకుండా, టీ, బిస్కెట్లు తీసుకుంటూ, ఆకలిదప్పులు సహిస్తూ యెన్నో కష్టాలకోర్చి అమ్మను దర్శించారు. ఇలా చాలామంది మహాత్ములను ముందుగా తాను దర్శించి, సేవించి ప్రజలు కూడా వారిని దర్శించేలాగా ప్రోత్సహించారు. అంతేకాదు, లక్ష్మీదేవి భక్తుడయిన వేణుగోపాల్ వంటి సాధకులు లక్ష్యం మరచి పతనం కాకుండా కాపాడుతూ సరియైన మార్గంలోకి వారి మనసులను మరలించి వుద్ధరించారు.

భక్తులు పిలిచిన ప్రతి చోటికీ వెళ్తూ, రాష్ట్రం అంతా తిరుగుతూ ప్రజలలో దైవభక్తిని మేల్కొలిపారు. నాస్తికులు, హేతువాదులతో తలపడి వారినుండీ నిందలను, విమర్శలను యెదుర్కొన్నారు. కులమత భేదాలు కూడదని అందరమూ ఒకే భగవంతుని బిడ్డలమని సర్వ సమానత్వాన్ని తెలియజెప్పారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించారు. ఇందుకు ఫలితంగా మతఛాందసుల నుండి యెన్నో సమస్యల నెదుర్కొన్నారు.

సాయినాథుని దివ్యత్వాన్ని ప్రచారం చేస్తున్న శ్రీ భరద్వాజగారు హిందూ సంఘాల నుండి కూడా తిరుగుబాటు యెదుర్కొన్నారు. సాయిబాబా ముస్లిం ఫకీరు అనీ, ఆయనను ఆరాధించటం మత విరుద్ధమనీ చాలా మంది హిందువులు ఆయనను తీవ్రంగా విమర్శించారు

శ్రీ భరద్వాజగారి బోధలతో సద్గురు సాయినాథుని ఆశ్రయించి, ఆరాధిస్తూ, సాయి అనుగ్రహాన్ని పొందుతూ కృతజ్ఞతతో తను బిడ్డలకు సాయిబాబా పేరు పెట్టుకుంటూ, తమ వూర్లలో సాయి మందిరాలను నిర్మించుకొంటూ ఆంధ్ర దేశ ప్రజలు సాయిబాబా భక్తి సాగరంలో ఓలలాడసాగారు. సాయినాథుడు వెలసిన శిరిడీక్షేత్రం తెలుగు ప్రజలతో క్రిక్కిరిసి పోసాగింది. ఇదంతా మత ఛాందసులకు కంటగింపుగా మారింది. హిందువు లందరూ శ్రీరామ కృష్ణాదుల వంటి హిందూ దేముళ్ళనే పూజించాలనీ, ముస్లింఫకీరైన సాయిని ఆరాధించటం మత విరుద్ధమనీ చెపుతూ శ్రీ భరద్వాజగారిని విమర్శిస్తూ అనేకవిధాలుగా నిందించసాగారు. ఆ విమర్శలకు, నిందలకు బెదరక, అన్నింటినీ భరిస్తూ మనకోసం ఆయన తన మార్గంలో ముందుకు సాగారు. ఆ నిస్వార్థపరుడు, త్యాగశీలి ప్రజాశ్రేయస్సు కోసం వెనుకడుగు వేయకుండా యేటికి యెదురీదినట్లుగా వ్యతిరేకత నెదుర్కొంటూ ముందుకుసాగారు.

తన వద్దకు వస్తున్న, తనయింటికి వస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రేమతో ఆదరించి, నిద్రాహారాలు మాని వేసి అహర్నిశలు జ్ఞాన బోధలు చేస్తూ తుది శ్వాస వరకు శ్రమించిన ఆ కరుణామయుని నిస్వార్థ, త్యాగమయ జీవితానికి శిరసు వంచి నమస్కరిద్దాం!

భగవంతుని అస్తిత్వాన్ని శంకిస్తూ, దేముడు లేడని వాదిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నాస్తికులకు హేతువాదులకు సమాధానంగా శ్రీ భరద్వాజగారు 72 మంది ఆధునిక విజ్ఞానవేత్తల (సైంటిస్టుల) పరిశోధనలను వివరిస్తూ, సైన్స్ ప్రకారం దేముడున్నాడన్న విషయాన్ని నిరూపించి చూపారు. ఆ విషయాలన్నీ వివరిస్తూ 'యేది నిజం?" "విజ్ఞాన వీచికలు" అనే అద్భుతమైన గ్రంథాలను రచించి ప్రజల కందించారు

అంతే కాదు, శ్రీ భరద్వాజ గురుదేవులు యెందరో మహాత్ముల జీవిత చరిత్రలు రచించారు. వారి జీవితాలను దివ్యబోధలను ప్రజల కందించారు. వారివలె మోక్ష మార్గంలో నడచి తరించాలని బోధించి, దైవభక్తి పట్ల ప్రజలను వుత్తేజితులను చేశారు.

'శ్రీ సాయిలీలామృతము', 'శ్రీ గురుచరిత్ర' అనే అద్భుతమైన గ్రంథ రచనల ద్వారా దత్తావతారులైన ఆ సద్గురువుల మహిమను ప్రజలకు చాటి చెప్పారు. ఆ చరిత్రల పారాయణ ప్రాముఖ్యతను తెలియజేశారు.

వేలాదిమంది భక్తులు ఆ చరిత్రలను పారాయణలు చేసి, ఆ మహనీయుని అనుగ్రహం పొంది ఇహపర శ్రేయస్సులను పొందుతున్నారంటే యిదంతా శ్రీ భరద్వాజ గురుదేవుల విశేష కృషి ఫలితమే!

శ్రీ భరద్వాజగారు మనుషుల వివిధ రకాల మనస్తత్వాలకు అనుగుణంగా వివిధ రకములైన సాధనా విధానాలను ప్రజలకు బోధించారు. భక్తులచే దీక్షలు, సాధనలు చేయించారు. కొందరిని సర్వసంగపరిత్యాగులుగా చేసి వుద్ధరించిన సంఘటనలు కూడా వున్నాయి.

ఆయన తన సుఖసంతోషాల గురించి, తన భార్యాబిడ్డల సుఖ సౌఖ్యాల గురించి యేనాడూ తపించలేదు. ప్రాధాన్యత నివ్వలేదు. అలాగని భార్యాబిడ్డలకి యే విషయంలోనూ యెటువంటి లోటు రానివ్వలేదు. వారిని కూడా ఆధ్యాత్మిక రంగంలో నడిపించారు.

అజ్ఞానంలో వున్న ప్రజలకు జ్ఞానమార్గాన్ని బోధించినట్లే, లౌకికంగా కూడా అసహాయులకు తన ఆపన్న హస్తాన్ని అందించేవారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేవారు. ఆర్థిక యిబ్బందులు పడేవారు, ఆపదలలో వున్నవారు సహాయం కోరితే వారికి వెంటనే ధనసహాయం చేసేవారు. తనకు ఆ రోజు భోజనానికి అవసరమైన డబ్బులు వున్నాయా లేదా అని కూడా ఏమాత్రం ఆలోచించక తన దగ్గర వున్న డబ్బు అంతా వారికి యిచ్చివేసి వారిని ఆదుకునేవారు.

ఇలా ఆలోచించుకుంటూ పోతే శ్రీ భరద్వాజగారు ప్రజల కోసం చేయనిది అంటూ యేమైనా వున్నదా? – అని సందేహం వస్తుంది. ఎన్నెన్నో విధాలుగా అందరికీ మేలు చేస్తూ తనను తాను ప్రజలకు సంపూర్ణంగా అర్పణ చేసుకున్న మహాత్ముడు శ్రీ భరద్వాజ మాస్టరుగారు. అసలు లోకోద్ధరణ కోసం యింతగా శ్రమించిన మరొక మహాత్ముడు యెవరైనా వేరొకరు వున్నారా అని శోధించి చూస్తే, నేను అయితే యెవ్వరూ లేరు అని ఖచ్చితంగా చెప్పగలను!

ఎందరో సద్గురువులను, మహాత్ములను చూస్తుంటాము. వారి గురించి వింటూవుంటాము. కానీ యీ విధంగా పుట్టినది మొదలు తుదివరకు ప్రజలతో మమేకమై అతి నిరాడంబరంగా జీవిస్తూ, మానవాళిలో ఆధ్యాత్మిక వెలుగులు నింపిన మహోన్నతుడు, మహితాత్ముడు శ్రీ భరద్వాజ గురుదేవులు ఒక్కరే అనేది నిజం.

నిస్వార్థతతో తన జీవితంలోని ప్రతి క్షణమును మనకోసమే ధారపోసిన త్యాగశీలి శ్రీ భరద్వాజగారు. తనను తాను మనకు దత్తం చేసుకున్న శ్రీ దత్తాత్రేయుల వారే ఈ కలియుగంలో అవతరించిన శ్రీ భరద్వాజ మాస్టరుగారు అన్నది అక్షర సత్యం. నాటికి, నేటికి, యేనాటికీ ఆ పరమాత్ముని సంపూర్ణ జీవితం మనకే అంకితం అన్నది పరమ సత్యం!

జై సాయి మాస్టర్!

## శ్రీరామునివలె ధర్మాన్ని ఆశ్రయించాలి!

03వ పేజీ తరువాయి

స్కంధంలో) వివరించాడు; సముద్రం తనలోని రత్నాలలో ఒక్కదానిని కూడ బయటపడనివ్వదు. ఎవరికీ అంటిపెట్టనిదై అపారంగా వుండిపోతుంది. కాని బయటనుండి పనికిరాని గడ్డిపోచలవంటి చెత్తను కించిత్తు కూడా తనలో చేరనివ్వదు. ఒడ్డుపైకి కొట్టిపారేస్తుంది. అలానే మనం గూడ అసత్యమైన భావానికి, మాటకు, క్రియకు, సాంగత్యానికి కించిత్తైనా మన హృదయంలో తావివ్వకూడదు. మొదట కొద్ది సంఖ్యలోనున్న కలుపు మొక్కలను అశ్రద్ధచేస్తే చివరికి అవే ఎక్కువై విలువైన పైరును పాడుచేస్తాయి. వాటిని మన చెంత చేరనివ్వకుండా శ్రీరాముని వలె జాగ్రత్తతో ధర్మాన్ని మాత్రమే ఆశ్రయించి జీవించాలని సాయి భావం. శ్రీరామనవమినాడే తమ ఉరుసుగూడ జరుపుకొమ్మని సాయి భక్తులను ఆదేశించడంలోని భావమిదే. ఈ క్షణం నుండి అలాంటి నిర్ణయం తీసుకుని మనమందరము దృఢమైన నిష్ఠతో, అచంచలమైన ఓరిమితో సాయి – రాముల అడుగుజాడలలో నడుద్దాం, కురువృద్ధుల బాటలో గాదు. అధర్మాన్ని, అసత్యాన్ని కించిత్తుగూడ ఉపేక్షించకుండా ధర్మాన్ని, సత్యాన్ని కించిత్తైనా విడువకుండా నడుచుకొనే చిత్తశుద్ధి, వివేకము, ఆ సాయి – రాములు మనకనుగ్రహించుగాక!

# మాతృదేవి స్మృతులు

**శ్రీ మనోజ్**

మాతృదేవి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని ఎండ్లూరు వాస్తవ్యులైన శ్రీ మనోజ్ ఈవిధంగా తెలియచేస్తున్నారు.

నేను మొట్టమొదట 2020లో నాగోలు(హైదరాబాదు)లో జరిగిన పూజ్య గురుదంపతుల కళ్యాణమహోత్సవానికి హాజరయ్యాను. అప్పటికే పూజ్యశ్రీ అమ్మగారి ఆరోగ్యపరిస్థితి బాగా లేనందువలన వారిని నేను సశరీరంగా దర్శించుకోలేకపోయాను. కానీ కళ్యాణమహోత్సవంలో సేవ చేసుకోగలిగాను. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు.. వీరి గురించి ఏమాత్రం అవగాహన లేదు. అప్పట్లో నాగోలులో వుంటున్న శ్రీ రమేష్ గారితో మాకు పరిచయముంది. ఆయన పిలవడంవల్ల మొదటిసారి నాగోలుకి వచ్చాను. అప్పుడు ఒక లీల జరిగింది.

కళ్యాణమహోత్సవం మూడురోజులు జరిగింది. అందులో రెండవరోజు భోజనపదార్థాలు చాలా మిగిలిపోయాయి.వేడివేడి పదార్థాలు, గడ్డపెరుగు యివన్నీ వున్నాయి. నేను మరొక యిద్దరితో కలిసి ఎల్.బి.నగర్ పరిసరాలలో అవి పంచడానికి దాదాపు రాత్రి 10:30 గంటల సమయంలో ఆటోలో వెళ్ళాను. ఒక గంటసేపు ప్రయత్నించినా ఎవరూ రాలేదు. మళ్ళీ అన్ని పదార్థాలు తీసుకుని వెనక్కి వెళ్లవలసివస్తుందనుకున్నాను. రమేష్ గారికి ఫోన్ లో విషయం చెప్పి "వచ్చెయ్యమంటారా?" అని అడిగాను. "రావద్దు, అమ్మగారికి నమస్కారం చేసుకోండి!" అన్నారు. అలాగే ముగ్గురం నమస్కారం చేసుకున్నాం. కాసేపటికి ఎక్కడనుంచి వచ్చారో కానీ చాలామంది వచ్చేశారు. మా దగ్గరవున్న పదార్థాలన్నీ పూర్తిగా అయిపోయాయి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. 'పూజ్యశ్రీ అమ్మగారు ఇంత శక్తిమంతులా?!' అనిపించింది. అప్పటినుంచి నాకు నమ్మకం ఏర్పడి పారాయణ చేయడం మొదలుపెట్టాను.

పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందిన తర్వాత మా ప్రాంతానికేవచ్చిమాతోనేవుంటారనిఎప్పుడూ ఊహించనైనా లేదు. 2021, జూన్ 3వ తేదీన పూజ్యశ్రీ అమ్మగారిని అక్కడికే తీసుకువస్తున్నామని, నన్ను గుమ్మళంపాడులో వుండమని రమేష్ గారు ఫోన్ చేశారు. 4వ తేదీన కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. అప్పటినుంచి నేనుకూడా పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలోనే వుండిపోయాను. నేను B.Com (computers) చేసి, MBA మొదలుపెట్టి పూర్తిచేయలేదు. ఉద్యోగప్రయత్నాలు చేసుకుంటున్నాను. ఒంగోలులో ఒకటి, చెన్నై లో ఒకటి ఉద్యోగాలు వచ్చాయి. వెళ్లాలనిపించేది. మన దగ్గరికి పూజ్యశ్రీ అమ్మగారు వస్తే, ఆ తల్లిని వదిలి నేను బయటికి వెళ్లిపోవడమేమిటని మళ్ళీ ఆలోచించేవాడిని. ఇలాగే ప్రయత్నాలు చేయడం, ఉద్యోగాలు రావడం, తిరిగి మానెయ్యడం జరిగేది. మొత్తానికి యిక్కడే వుండిపోయాను. నా అదృష్టవశాత్తు మా తల్లిదండ్రులు కూడా నా యిష్టానికే వదిలేశారు! తరవాత ఆలోచిస్తే ఈ సంప్రదాయమే తెలియని నన్ను పూజ్యశ్రీ అమ్మగారు తమదగ్గరే వుండేలా చేశారనిపిస్తుంది.

పూజ్యశ్రీ అమ్మగారు వచ్చిన కొత్తల్లో చాలా పెద్ద వడగండ్ల వాన వచ్చింది. కొత్తగా షెడ్ వేశాము. అప్పటివరకు

*మిగతా 29వ పేజీలో*

# పూజ్య గురుదంపతుల కల్యాణ వైభోగ మహోత్సవం!!

***శ్రీమతి టి.పద్మావతి***

ఈ సంవత్సరం మార్చి 6వ తేదీన గుమ్మళంపాడు గ్రామ శివారులోని మాతృదేవి సన్నిధిలో జరిగిన పూజ్య గురుదంపతులు శ్రీ అలివేలుమంగాభరద్వాజుల కల్యాణ మహోత్సవం అత్యద్భుతం, అమోఘం, అసాధారణం!!

మాతృదేవి సమాధి మందిర ఆవరణాన్ని ముందు భాగంలోనూ మరియు రెండువైపులా కూడా విస్తరింపజేసి విశాలంగా నిర్మించడం వలన ఇంతకుముందు సంవత్సరాలలోజరిగినట్లుకాకుండా ఈసారిగురుదంపతుల లీలా కళ్యాణం సమాధి మందిర ఆవరణలోనే జరిగింది. ఇదొక విశేషం!! కళ్యాణ మహోత్సవాలతో పాటుగా పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో జరిగే నిత్యసేవలు కూడా యథావిధిగా కొనసాగాయి.

త్రిమూర్తి స్వరూపమైన శ్రీ సాయిబాబా, శ్రీ మాస్టరుగారు, శ్రీ అమ్మగారు సన్నిధిలో గురుదంపతుల కల్యాణం జరగడం ముదావహం. సన్నిధి అంతా శోభాయమానమైన కుసుమాలంకారంతో, తళుకులీను కాంతులతో మెరిసే విద్యుత్ దీపాలతో సరికొత్త శోభను సంతరించుకుంది.

5వ తేదీ తెల్లవారుఝామునే, పూర్ణకుంభంతో స్వాగతిస్తూ, చిత్రపటరూపంలో నున్న వధూవరులను విడివిడిగా విడిది గృహానికి ఆహ్వానించారు. అక్కడ వారిరువురికి సకలోపచారములు భక్తిశ్రద్ధలతో గావించి, యిద్దరినీ అతిలోకసుందరముగా అలంకరించారు.

కల్యాణ క్రతువులో భాగంగా పెండ్లి కుమార్తె అయిన, పూజ్యశ్రీ అమ్మగారి పాదుకలు వారి అల్లుడుగారు శ్రీ అడిదం శ్రీకాంత్ గారు శిరస్సుపై నిడుకుని, గురుపుత్రిక శ్రీమతి వేదవతిగారు వెంటరాగా, ఆ వెనుక పూజ్యశ్రీ అమ్మగారికి భక్తులందరూ పూలవాన కురిపిస్తూండగా కల్యాణ మంటపమునకు తరలివచ్చారు.

అదేవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు శిరస్సుపై నిడుకుని, శ్రీమతి లయరాగితగారు వెంటరాగా, ఆ వెనుక పూజ్యశ్రీ మాస్టరుగారిపై భక్తులందరూ పూలవాన కురిపిస్తూండగా కళ్యాణమంటపమునకు తరలివచ్చారు.

ముందుగా విప్రులు పుణ్యాహవచనం, గణపతి పూజ గావించి, కాబోయే వధూవరుల పాదుకలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. పూజ్యశ్రీ అమ్మగారి తరపున శ్రీ శ్రీకాంత్ గారు, శ్రీమతి వేదమ్మగారు – పూజ్యశ్రీ మాస్టరుగారి తరపున శ్రీ ద్వారకబాబుగారు, శ్రీమతి లయరాగితగారు కూర్చుని శ్రీసూక్త, పురుషసూక్త సహితంగా అభిషేకం చేశారు. అనంతరం వధూవరులకు షోడశోపచార పూజ, పట్టువస్త్ర సమర్పణ చేసి, మంగళహారతినిచ్చి ఆ పూట కార్యక్రమాలకు స్వస్తి చెప్పారు. కాబోయే వధూవరులను విడిదికి సాగనంపారు.

తిరిగి సాయంత్రం ధూప్ హారతి అనంతరం ఎదురుకోలు వేడుకలతో కల్యాణోత్సవం మొదలయ్యింది. ముందుగా గురుదంపతుల కల్యాణానికి చిత్రపట రూపంలో విచ్చేసిన మహాత్ములందరిని ఆహ్వానించి, వేదిక నలంకరింప చేశారు. వారందరిని పుష్పమాలాలంకృతులను చేసి, చల్లటి పానీయముల సమర్పించి మర్యాద చేశారు. అనంతరం మంగళమూర్తి భరద్వాజ గురుదేవులు మంగళవాద్యముల నడుమ, తనవారందరితో కలసి, పూలబాటలో వేదిక నలంకరించారు. ముందుగా విప్రులు వరపూజ గావించారు.

తరువాత వాద్య ఘోష నడుమ కొంతమంది ముత్తైదువలు సారె తీసుకుని వెంటారాగా, కుసుమ కోమలి, సుమంగళీ స్వరూపిణి, అలివేలుమంగ మాత వేదిక నలంకరించారు.

కాబోయే దంపతులను ఎదురెదురుగా ఆశీనులను చేయగా,,, శ్రీమతి వేదమ్మ, శ్రీమతి లయమ్మ బృందం, మర్నాడు జరగబోయే కళ్యాణానికి ఆహ్వానిస్తూ, "కళ్యాణము చూడరారండి" అనే గీతాన్ని హృద్యంగా గానం చేయగా, శ్రీ యోగనాగేంద్ర వాద్యసహకారం అందించారు.

తరువాత శ్రీమతి వేదమ్మగారు ఎదురుకోలు ఉత్సవాన్ని మొదలుపెట్టారు. మాతృదేవి సోదరి అయిన శ్రీమతి శ్రీదేవిగారు రాసిన సన్నివేశానికి సరిపడే ఎదురుకోలు గీతాన్ని శ్రీమతి వేదమ్మ గారి బృందం ఆలపించారు.

***మగపెళ్ళివారు:***

*'ఆగిపోక సాగి రావే,*
*అలివేలు మంగమ్మ!*
*వేగమే మా స్వామి మెడలో*
*వేయరావె పుష్పమాల!'*

***ఆడపెళ్ళివారు:***

*'స్వామి రూపు, స్వామి తలపు,*
*మనసంతా నిండి వున్నా—*
*ఆశలన్నీ తనలో దాచి ఆగిపోయింది!*
*మనసులోని బిడియమామెను సాగనీకుంది!*

.... అంటూ సాగిపోయే ఆ గీతానికి శ్రీమతి వేదమ్మగారు చక్కటి వివరణని అందించారు. ఆ గీతంలోని భావం ప్రకారం ఒకొక్క అడుగే వధూవరులు నడచి వచ్చి, పుష్పమాలలని, ఒకరి కంఠసీమలో మరొకరు అలంకరించుకున్నారు. తదుపరి లగ్నపత్రికని చదివి బ్రహ్మగారు అందరికి వినిపించగా, పానకంతో నోరు తీపి చేసుకుని, కాబోయే వధూవరులకి నూతన వస్త్రాలు సమర్పించుకుని, మంగళహారతినిచ్చి ఆ పూట ఉత్సవానికి స్వస్తి పలికారు.

ఆ మరురోజు, మార్చి 6, అందరూ ఉత్కంఠతతో ఎదురుచూసిన 'గురుదంపతుల కల్యాణ శుభవేళ' రానేవచ్చింది. చుట్టుపక్కల గ్రామాలనించి, నగరాలనించి, పట్టణాలనించి కల్యాణ మహోత్సవం తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ముందుగా చిత్రపట రూపంలో వున్న మహాత్ములందరిని వేదికను అలంకరింపచేసి, పూజ్య గురుదంపతుల గురుదేవులైన, సమర్థ సద్గురు సాయినాథులవారిని అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణ మంటపానికి ఆహ్వానించారు. తదుపరి వధూవరులు విచ్చేసారు. ముందుగా ఆదినాథుడైన సాయినాథులవారికి పట్టువస్త్రాలను సమర్పించి, తరువాత వధూవరులకు పట్టువస్త్ర సమర్పణ గావించగానే పెళ్లి తంతు మొదలయ్యింది. వేదవిప్రులు శ్రీ బాలకృష్ణ శర్మగారు, సన్నివేశాలకు తగినట్లు క్రతువుని వర్ణిస్తూంటే, పండితులు శ్రీ మహేష్ శర్మగారు, శ్రీ జయరాం శర్మగారు పెళ్ళివేడుక జరిపించారు. "సిరికళ్యాణపు బొట్టును పెట్టి,,, మణిబాసికమును నుదుటన కట్టి,, పారాణిని పాదాలకు పెట్టి,,,,," అంటూ సీతారాముల కల్యాణాన్ని వర్ణించినట్లు పూజ్యశ్రీ అలివేలుమంగా భరద్వాజులను పెళ్లిపీటల మీద చూసిన వారందరికీ సాక్షాత్తు సీతారాములని చూసిన భావన కలిగిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

వశిష్ఠులవారు సుముహూర్తం, మంగళ సూత్రధారణ జరిపించి, అనేకమంది భక్తులు నామం చెప్పుకుంటూ ఏరిన బియ్యంతో గురుదంపతులకు తలంబ్రాలు పోయించి, మాలా పరివర్తనం చేసి, కొంగుముడులతో దంపతులను ఒక్కటి చేసాక, గురుదంపతులకు మంగళహారతినివ్వడంతో వివాహ వేడుకలు ఆ పూటకి ముగిసాయి.

ఈ మహోత్సవానికి వచ్చినవారందరూ, గురుదంపతులకు నమస్కరించుకుని, తాము తెచ్చిన కానుకలను భక్తిప్రపత్తులతో సమర్పించుకుని, త్రేతాయుగంలో జరిగిన కల్యాణాన్ని తనివితీరా ఇప్పుడు తిలకించామన్న తన్మయత్వంతో మనసారా నమస్సుమాంజలులు అర్పించుకుని వివాహ విందుకు బయలుదేరారు. ఇంకొక్కమాట,,, ఈ కళ్యాణం తిథిప్రకారం కావలి, చీరాల, బాపట్ల, పామూరు, మాలపిచ్చమ్మ ఆశ్రమం, ఏలూరు, నాగోలు (హైద్రాబాద్), ఒంగోలు మంగమూరు డొంకలో, పెద్దఎత్తున జరుపుకున్నారు. విద్యానగర్ మొదలైన ప్రాంతాలలో విశేషపూజలు చేసుకున్నారు., చాలామంది ఇళ్లల్లో కూడా ఈ ఉత్సవాన్ని జరుపుకున్నారు. మరి ఇది జగత్ కళ్యాణం కాక మరేమిటి!!

మరి అంతటి గురుదంపతులకు వినోద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయకుండా వుండగలమా,,, అన్న భావనతో,,,

***మిగతా 19వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## 12వ ప్రసంగము

### శబ్దానువిద్ధము, శబ్దాననువిద్ధము అగు సవికల్ప సమాధి

'ఓం' శబ్దముతో వృత్తిని ఉత్థానము చేసి (పైకి తెచ్చి) పరమాత్మను ధ్యానించాలి. ఓంకారముతోపాటు వృత్తికూడా ఔన్నత్యాన్ని పొందుతుంది. ఓంకారము శాంతించేదాకా వృత్తి పరమాత్మ యందే నిలిచివుంటుంది. ఓంకారముతో కూడిన వృత్తి వున్నంతసేపూ శబ్దానువిద్ధమైన (శబ్దంతో కూడిన ) సవికల్ప సమాధి వుంటుంది. నెమ్మది నెమ్మదిగా ఆలంబనము తప్పిపోతుంది.

శబ్దానువిద్ధ (శబ్దంతో కూడిన) సవికల్ప సమాధికి శబ్దవేధి అయిన (చీకట్లో సైతం గురిచూసి బాణం వేయగల) దశరథుని వృత్తాంతం దృష్టాంతముగా చెప్పవచ్చు.

ఒకప్పుడు దశరథుడు వేటకు వెళ్ళాడు. అతడు కటిక చీకటిలో ఒక నీటికొలను సమీపంలో వున్న ఒక పొద వెనుక కూర్చొని వున్నాడు. ఇంచుమించు తెల్లవారుఝామున నాలుగు గంటలకు శ్రవణుడు సొరకాయ బుర్ర తీసుకొని తల్లిదండ్రులకు నీటిని తీసుకువెళ్లడానికి వచ్చాడు. అతడు నీరు నింపుకుంటూ వుండగా బుడబుడమనే శబ్దము వచ్చింది. అది దశరథుడు విన్నాడు. ఏ ఏనుగో తొండముతో నీరు త్రాగుతోందని భావించాడు. వెంటనే ధనుస్సును ఎక్కుపెట్టి శబ్దాన్ని బట్టి గురిచూసి బాణమేసి శ్రవణుడిని కొట్టాడు.

ఈ సంఘటనలో 'బుడబుడ'మనే శబ్దముతో వినికిడికి సంబంధించిన ఇంద్రియం (చెవి) తన్మయత్వం చెందింది. శబ్దము చేసే వ్యక్తితో వృత్తికి సంబంధముంది. అలాగే ప్రణవరూపమైన (ఓంకార రూపమైన) శబ్దంతో శ్రోత్రేంద్రియానికి (వినికిడికి సంబంధించిన ఇంద్రియమైన చెవికి) సంబంధమున్నది. బ్రహ్మముతో వృత్తికి సంబంధముంది. ప్రణవరూపమైన శబ్దము చేత

అనువిద్ధమైన (కూడిన) బ్రహ్మరూపమైన లక్ష్యాన్ని భేదించమని వేదాల ఆజ్ఞ. వృత్తి శబ్దానువిద్ధమైనంతవరకూ (శబ్దానువిద్ధమవడం అంటే శబ్దంతో కూడి వుండడం) శబ్దవేధమనబడుతుంది.

ఓం శబ్దము ఆగినప్పుడు వృత్తి మాత్రము వుంటుంది. అది శబ్ద – అననువిద్ధము – అంటే శబ్దరహితము. శబ్ద – అననువిద్ధమైన వృత్తి సత్త్వప్రధానమౌతున్నకొద్దీ సూక్ష్మత్వాన్ని పొందుతుంది 'సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః' అని కూడా శృతిలో (వేదంలో) చెప్పబడింది. సూక్ష్మాతి సూక్ష్మమైన దృష్టి కలవాడు మాత్రమే పరమాత్మను దర్శించగలడు. వృత్తి అతిసూక్ష్మమై శుద్ధసత్త్వ గుణమయమైనప్పుడు ఆవరణ భంగమౌతుంది.

## దృశ్యానువిద్ధము దృశ్యాఽననువిద్ధము అయిన సవికల్ప సమాధి

దృశ్యానువిద్ధమైన (దృశ్యంతో కూడిన) సవికల్ప సమాధి పద్ధతి మాండుక్యోపనిషత్తులో చెప్పబడింది. 'ఓం ఇత్యేదక్షరమిదం సర్వమ్'. 'ఓం' అనబడు అక్షరమే ఇదంతా! ప్రత్యక్ష ప్రమాణ విషయమైన ఈ జగత్తు అంతా 'ఓం' కార రూపము.

'సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత' అని ఛాందోగ్యము చెబుతున్నది. ఈ నామరూపాత్మకమైన జగత్తు అంతా బ్రహ్మము. ఎందుకంటే ఈ జగత్తు దాని నుండే పుట్టింది. దానియందే పెరుగుతుంది. దానియందే లయమౌతుంది. కాబట్టి శమదమాది సాధనాలను సంపాదించి దానిని ఉపాసించు.

అందువలననే నామరూపాలను పరిత్యజించి** అస్తి, భాతి, ప్రియరూపమైన బ్రహ్మముతో వృత్తిని కలుపు. ఈ విషయంలో మత్స్యవేధమును దృష్టాంతంగా గ్రహించవచ్చు. అర్జునుడి మత్స్యయంత్ర భేదన పద్ధతి ఇది – నీటి కుండము మధ్యలో ఒక స్తంభము వుంటుంది. ఆ స్తంభానికి మధ్యలో ఒక త్రాసు వుంటుంది. ఆ త్రాసు సిబ్బెలో నిలబడి శరీరాన్ని సమస్థానంలో సమంగా నిలపాలి. స్తంభము పైభాగంలో ఒక బంగారు చేప వ్రేలాడదీయబడి వున్నది. అది గిరగిర తిరుగుతోంది. అలా తిరుగుతున్న చేప యొక్క ప్రతిబింబం నీటిలో పడుతున్నది. ఆ ప్రతిబింబాన్ని చూస్తూ ఆ చేపను బాణంతో కొట్టాలి.

అలాగే శరీరాన్ని సమస్థానంలో నిలిపి అర్జునుడు ఆ మత్స్యాన్ని (చేపను) భేదించాడు (బాణంతో కొట్టాడు).

ఈ దృష్టాంతంలో కన్ను అనే ఇంద్రియ సంబంధం ప్రతిబింబంతో కలిగింది. వృత్తికి బింబంతో సంబంధం కలిగింది. సిద్ధాంతంలో నామరూపాలతో కన్నులను (నేత్రాలను) కలిపి, అస్తి, భాతి, ప్రియా రూపమైన బ్రహ్మంతో వృత్తిని కలపాలి. నామరూపాలతో కన్నులకు సంబంధం వున్నంతవరకు దృశ్యానువిద్ధ సవికల్ప సమాధి వుంటుంది. నామరూపాల నుండి వృత్తి తప్పుకొని అస్తి, భాతి, ప్రియ రూపమైన బ్రహ్మంతో మాత్రము సంబంధం కలిగివున్నప్పుడు దృశ్యాననువిధమైన (దృశ్యానికి అతీతమైన) సమాధి అనబడుతుంది. అభ్యాస పరిపాకం వలన రూపమనే ఆలంబన లేకపోయినా వృత్తి బ్రహ్మత్వాన్ని పొందగలుగుతుంది. అంటే అస్తి, భాతి, ప్రియ రూపమైన బ్రహ్మాన్ని ధ్యానించగలడు.

ధ్యానము యొక్క పరిపక్వమైన స్థితి సవికల్ప సమాధి. సవికల్పసమాధి యొక్క పరిపక్వావస్థ నిర్వికల్ప సమాధి. నిర్వికల్ప సమాధి రెండు రకాలు – అద్వైత భావన, అద్వైత అవస్థ. నిర్వికల్ప సమాధి జ్ఞానానికి కారణము.

## సమాధికి తీవ్ర వైరాగ్యము అవసరము

వైరాగ్యమును పొంది ఏకాంతంలో కూర్చుని ధ్యానించాలని చెప్పబడింది. కారణం వైరాగ్యం కలుగునంతవరకు సమాధి సిద్ధించదు. తీవ్ర వైరాగ్యము కలవాడికే సమాధి స్థితి కలుగుతుంది. 'తీవ్ర సంవేగానామాసన్నః సమాధి లాభః' అని యోగ సూత్రంలో వున్నది. తీవ్ర వైరాగ్యము కలవాడికి సమాధి స్థితి కలుగుతుంది.

***ప్రపంచంలో ఐదు అంశాలుంటాయి – అస్తి (ఉనికి), భాతి (ప్రకాశం), ప్రియం (ఆనందం), నామం, రూపం. మొదటి మూడు బ్రహ్మానికి సంబంధించినవి (సత్ – చిత్ – ఆనందం). మిగిలిన రెండూ జగత్తుకు సంబంధించినవి (నామ, రూపాలు).*

ఈ లోకానికి, పరలోకానికి సంబంధించిన విషయాలన్నింటిపట్ల కాకిరెట్టపట్ల లాగా రాగభావము కలిగి వుండడం తీవ్ర వైరాగ్యము. ఆ తీవ్ర వైరాగ్యము కలవానికే సమాధి స్థితి లభిస్తుంది. ఈ వైరాగ్యము లేనిదే సమాధిని అభ్యసించేవాడికి సిద్ధి కలుగదు. ఇలా అభ్యసించే వాడిని శాస్త్రంలో 'అవివేకి' అంటారు.

*శ్లో॥ మాతురంకగతో బాలో*
*గ్రహీతుం చంద్రమిచ్ఛతి ।*
*యథా యోగం తథా యోగీ*
*సంత్యాగేన వినాఽబుధః ॥*

భావం: తల్లి ఒడిలో వున్న బాలుడు చంద్రుడిని పట్టుకోవాలనుకుంటాడు. అలాగే అవివేకి అయిన యోగి సరిగ్గా త్యాగము మొ॥న వాటిని అనుష్ఠించకుండానే యోగసిద్ధిని పొందాలనుకుంటాడు. తన పట్ల పూర్ణవైరాగ్యము లేనిదే తాను ధ్యానము మొ॥న అభ్యాసాలను చేసినట్లయితే ఏ విధంగానూ సిద్ధిని పొందడు. కాబట్టి అనిత్యములైన పదార్థాలన్నింటిపట్ల దోషదృష్టిని కలిగివుండి పూర్ణవైరాగ్యాన్ని సంపాదిస్తూ ధ్యానాభ్యాసాన్ని చేయాలి.

అప్పటికి చిత్తము ఏకాగ్రము కాకపోతే నిరాశ చెందకూడదు. ఈ విషయంలో శ్రీ గౌడపాదాచార్యులవారు ఇలా చెప్పారు –

*శ్లో॥ ఉత్సేక ఉదధేర్యద్వత్కుశాగ్రేణైవ బిన్దునా।*
*మనసో నిగ్రహస్తద్వద్భవేద పరిఖేదతః ॥*

భావం: గడ్డి పరక మొదలుతో (కుశాగ్రంతో) సముద్రంలోని జలాన్ని ఒక్కొక్క బొట్టూ తోడివేయడం ఎంత శ్రమతో కూడిన పనో మనోనిగ్రహం కూడా అటువంటిదే !

ఒకానొక పక్షి సముద్రపు ఒడ్డున మేడ కట్టుకోవడానికి ప్రయత్నించింది. అప్పుడు ఆడపక్షి దానితో చెప్పింది – "సముద్రానికి దూరంగా వున్న చెట్ల దగ్గర మేడ కట్టుకుందాము. లేకపోతే సముద్రం పొంగి ఇల్లు కొట్టుకొని పోతుంది!"

అప్పుడు మగపక్షి గర్వంగా ఇలా అన్నది – "సముద్రానికి నా ఇంటిని కొట్టుకు పోయేంతటి శక్తి వుందా? ఇల్లును కొట్టుకొని పోతే నేను సముద్రానికి తగిన బుద్ధి చెబుతాను!" అలా చెప్పి ఆ పక్షి ఇటుకలను పేర్చింది.

తరువాత సముద్రము పొంగి పక్షి భవనము ఇటుకలతో సహా కొట్టుకుపోయింది. పక్షి క్రోధంతో సముద్రమంతటిని ఎలాగైనా ఎండగొట్టాలని నిశ్చయించుకున్నది. ఆ ఉద్దేశంతో అది ఎడతెగని శ్రమ చేస్తూవున్నది. మగపక్షి, ఆడపక్షి ఒక్కొక్క ఇసుక రేణువును ఒడ్డు నుండి తీసుకువెళ్లి సముద్రంలో పడవేస్తూ సముద్రము నుండి ఒక్కొక్క బొట్టు నీటిని తెచ్చి బయట విడుస్తూవున్నాయి. ఆ ఇద్దరు అలా తీవ్రంగా శ్రమించటం చూసి ఆ జాతి ఇతర పక్షులన్నీ వచ్చి ఆ సముద్రాన్ని ఎండగొట్టడానికి ప్రయత్నించసాగాయి.

ఆ జాతి పక్షులు చేసే ప్రయత్నాన్ని చూసి మిగిలిన అన్ని జాతుల పక్షులు కూడా వచ్చి సముద్రాన్ని ఎండగొట్టటానికి ప్రయత్నించాయి.

పక్షులన్నీ ఇలా శ్రమిస్తూ వుండగా నారద మహర్షి అటువైపుకి వచ్చాడు. అన్ని జాతుల పక్షులు అక్కడ గుమిగూడి వుండడం చూసి ఆయన ఆశ్చర్యపోయాడు. ఆయన వైకుంఠానికి వెళ్లి గరుత్మంతునితో యిలా అన్నాడు – "భూలోకంలో నీ పక్షులన్నీ తీవ్రమైన శ్రమ చేస్తూ వుంటే నీవు ఏకాంతముగా వైకుంఠంలో కూర్చోవడం బాగుందా?"

నారదుని మాటలు విని గరుత్మంతునికి పౌరుషమొచ్చింది. అతడు ప్రచండ స్వరూపాన్ని ధరించి, అక్కడికి వచ్చి తన రెక్కలతో సముద్రాన్ని అల్లకల్లోలం కావించాడు. గరుడుని రెక్కల వేగాన్ని భరించలేక వరుణదేవుడు ప్రత్యక్షమై క్షమాపణ కోరాడు. గరుడుడు క్రోధంతో ప్రశ్నించాడు – "ఈ పక్షి ఇటుకలను నీవెలా దొంగిలించావు?"

వరుణుడిలా అన్నాడు – "ఈ పక్షి గొప్పలు పోతూవున్నాడు. అందుకని వినోదానికే అలా చేశాను".

అప్పుడు సముద్రుడు ఆ పక్షి భవనాన్ని యథాప్రకారం తిరిగి నిర్మించి ఇచ్చాడు.

తాత్పర్యమేమంటే బలాన్ని ఉపయోగించి ప్రయత్నిస్తే ఈ జగత్తులో లభించనిది ఏదీ లేదు.

స్వా॥ని॥ : ధ్యానయోగము చాలా కష్టము. సన్యాసులకు కూడా తెలియదు. ఇక గృహస్థులు ఎలా చేయగలరు?

స్వా॥ప్ర॥ : మన డాక్టరుగారు సన్యాసి లాంటివారే. ప్రస్తుతం వానప్రస్థంలో వున్నారు. ఆయన చేయగలరు.

డా॥లల్లూ : అడవులలో వుంటూ వానప్రస్థ ధర్మాన్ని పాటించేవాడు వానప్రస్థుడు. నేను వానప్రస్థుడినా? నేను ఇంట్లోనే వున్నాను.

స్వా॥ప్ర॥

*శ్లో॥ వనేషు దోషాః ప్రభవన్తి రాగిణాం*
*గృహేషు పంచేంద్రియ నిగ్రహస్తపః ।*
*అకుత్సితేకర్మణి యః ప్రవర్తతే,*
*నివృత్తరాగస్య గృహం తపోవనమ్ ॥*

అని శాస్త్రము చెబుతోంది.

భావం: రాగము కలవారికి అడవులలో కూడా దోషాలు కలుగుతాయి. ఇంటిలోనే వుండి పంచేంద్రియాలను నిగ్రహము చేయడమే తపస్సు. నిందకు అవకాశమిచ్చే పనులలో నిమగ్నులవకుండా రాగరహితులుగా వుండే వారికి ఇల్లే తపోవనము.

కొంతమంది వైరాగ్యము కలుగకుండానే సన్యాసం తీసుకుని అడవులలోకి వెళ్తారు. మఠము మొ॥న వాటిని సంపాదించి సకల సౌఖ్యాలను అనుభవిస్తారు. సన్యాసులు చేయకూడని నిందింపదగిన కర్మలను (పనులను) చేస్తారు. అనేక రకాలుగా పాపాన్ని పెంచుకుంటారు. అలాగే అనేకమంది గృహస్థులకు లోపల వైరాగ్యము వుండడం వలన సకల భోగాలను త్యజించి వారు ఇంద్రియనిగ్రహము చేస్తారు.

నేను క్రీ॥శ॥ 1900 వ సంవత్సరంలో హృషీకేశ్ కి వెళ్లాను. అక్కడి తపోవనంలో చాలామంది సాధువులు, సన్యాసులు వున్నారు. వారు యాత్రికుల నుండి అనేక మోసపూరితమైన ఉపాయాలతో ధనము సంగ్రహించేవారు. ఎంతో వైభవముతో కాలము గడిపేవారు. నేను క్రీ॥శ॥ 1900వ సంవత్సరంలో కచ్ నుంచి వెళ్లేటప్పుడు మోరబీ నగరంలో సేఠ్ పాపట భాయి దగ్గర ఆగాను. ఆయన ఊరి బయట ఆశ్రమం కట్టుకొని తన ఇంటి బాధ్యతలన్నింటిని తన కుమారునికి అప్పగించి భగవంతుని ధ్యానిస్తూ కాలక్షేపం చేసేవాడు. శంకరలాల్ శాస్త్రి అనే ఆయన వద్ద పురాణ శ్రవణము చేసేవాడు. శంకరలాల్ శాస్త్రి విద్వాంసుడు మాత్రమే కాదు. గొప్ప సాధువు కూడాను. ఒక రోజున శాస్త్రిగారు తన డాబా మీద కూర్చొని వున్నారు. ఆ సమయంలో ఎవడో భిక్షకుడు అక్కడికి వచ్చాడు. క్రిందిభాగంలో అతని రాకను గుర్తించేవారు ఎవరూ లేరు. కాబట్టి అతడు ఇంటిలోకి ప్రవేశించి చేతికి అందిన చెంబు తీసుకొని వెళ్ళిపోతున్నాడు. శాస్త్రిగారు పైన కూర్చుని ఇదంతా చూస్తూ వున్నారు. వెంటనే వారు క్రిందికి దిగివచ్చి ఆ భిక్షకుడిని వెనకకు తీసుకొని వచ్చారు. అతనిని బుజ్జగించి ఒక కంచము, చెంబు నిండా నెయ్యి యిచ్చి అతనిని సాగనంపారు.

ఇటువంటి వారికి ఇల్లే తపోవనము.

తర్వాత సాయంకాలము ప్రకాశానందుల వారిని తీసుకొని డా॥లల్లుభాయి మొ॥నవారు జేతపురము వెళ్లారు.

**~ 12వ ప్రసంగము సమాప్తము ~**

**- సశేషం**

## పూజ్య గురుదంపతుల కల్యాణ వైభోగ మహోత్సవం!!

15వ పేజీ తరువాయి

అదేరోజు సాయంత్రం హారతి అనంతరం “శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్” ఒంగోలు వారిచే “శ్రీ శిరిడి సాయి దివ్యచరితం” నృత్యరూపకం ప్రదర్శించబడింది. ఆ రూపకం చాలా అద్భుతంగా ప్రదర్శించబడింది. నవ దంపతులు పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ వినోద కార్యక్రమాన్ని ఆనందంగా తిలకించి, అందులో పాల్గొన్న చిన్నారులని తప్పక ఆశీర్వదించి వుంటారు అనుకోవడంలో ఎటువంటి సందేహము లేదు. ఉత్సవం చివరగా వారిద్దరిని పక్కపక్కన కూర్చోపెట్టి హారతి యిస్తుంటే, చూడడానికి రెండు కళ్ళూ చాలలేదు. ఆ రోజు వారు ధరించిన మాలలు మరింత శోభాయమానంగా వున్నాయి. నిజంగా వారి దివ్యమంగళ మూర్తులను చూస్తున్నామన్న ఆనందంలో అందరూ ఓలలాడారు. మళ్లీ తిరిగి వచ్చే సంవత్సరం తప్పకుండా అందరం కలిసి మరింత భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవం జరుపుకుందాం అన్న దృఢసంకల్పంతో అందరూ తిరుగు ప్రయాణమయ్యారు. ●

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**


*ఓం సమర్థ సద్గురు శ్రీ భరద్వాజాయ నమః*

## 1. శ్రీమాన్ అనంతాచార్య

శ్రీ భరద్వాజ మాస్టరుగారు, మాతృశ్రీ అలివేలుమంగ తాయారుగార్ల కళ్యాణం కర్నూలు జిల్లా బనగానపల్లి పట్టణంలో 1975వ సంవత్సరం, మార్చి 6వ తేదీన వైభవోపేతంగా జరిగింది. వివాహానంతరం విజయవాడలో శ్రీ మాస్టరుగారి తండ్రిగారైన శ్రీ అనంతాచార్యులవారి గృహంలో బంధుమిత్రాదుల మధ్య నవ వధూవరులకు 'విందు' జరిగింది. అటు తర్వాత మాతృశ్రీ అలివేలుమంగమ్మగారు విజయవాడలో శ్రీ అనంతాచార్యులవారి గృహంలో కొంతకాలమున్నారు.

శ్రీ అనంతాచార్యగారు తమ కుమారులు ఉద్యోగస్థులై జీవితాలలో స్థిరపడి, ఉద్యోగరీత్యా వేరు వేరు ఊర్లలో వుంటుండగా, తాము మాత్రం తమ జీవితంలో తామెక్కువగా గడిపిన విజయవాడలోనే ఒంటరిగా వుండేవారు. అప్పుడప్పుడు పిల్లల వద్దకు వెళ్ళి కొన్ని రోజులు వుండి తిరిగి విజయవాడ వస్తుండేవారు.

వివాహానంతరం అనంతాచార్యగారింటిలో వున్న సమయంలో ఆయన ఒకరోజు తమ కోడలు శ్రీమతి అలివేలుమంగ తాయారుగారితో, "నాలుగైదు రోజులనుండి శ్రీ శిరిడీ సాయిబాబాగారు ప్రతిరోజు నా వద్దకు వస్తున్నారమ్మా! వచ్చి కొంచెంసేపు నాతో మాట్లాడి నాలోకి వెళ్ళిపోతున్నారు. ఇదిగో! ఇవాళ కూడా - యింతకుముందే వచ్చారు" అని చెప్పారు. ఆమెకు ఆయన మాటలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. "బాబా రావడమేమిటి? రావటమే కాదు, వచ్చి, ఆయనతో మాట్లాడి ఆయనలోకి వెళ్ళిపోవటమేమిటి?" అనుకున్నారామె. అయితే శ్రీ అనంతాచార్య అప్పుడు ఆమెతో అంతకుమించి వివరాలేమీ చెప్పలేదు. ఆ తర్వాత కొద్ది నెలలకు శ్రీ అనంతాచార్య విద్యానగర్ వచ్చారు. విద్యానగర్ లో ఒకనాడు శ్రీ భరద్వాజ మాస్టరుగారింట్లోని లోపలిగదిలో శ్రీ మాస్టరుగారు, శ్రీ అమ్మగారు, శ్రీ అనంతాచార్యులవారు, నేను (రచయిత్రి) కూర్చునివున్నాము. శ్రీ అనంతాచార్యులవారు, శ్రీ భరద్వాజ మాస్టరుగారు, ఏవో




విషయాలు మాట్లాడుకొంటుంటే నేను, శ్రీ అమ్మగారు వింటూ కూర్చున్నాము. మాటల మధ్యలో శ్రీ అనంతాచార్యులవారు,

"భరద్వాజా! విజయవాడలో కొద్ది రోజుల క్రిందట శ్రీ సాయినాథుడు నాకు ప్రత్యక్ష దర్శనమిచ్చారు. నా దగ్గరకు వచ్చి నాతో కొంతసేపు

సంభాషించి చివరకు నాలో లీనమైపోయారు" అంటూ ఎంతో సంతోషంగా ఆనాటి ఆ సన్నివేశాన్ని మొదటి నుండి చివరి వరకు కళ్ళకు కట్టినట్లుగా వర్ణించి చెప్పారు.

మహత్తర సన్నివేశం యీ క్రింది విధంగా వుంది–

అది విజయవాడ నగరంలోని శ్రీ అనంతాచార్యులవారి నివాస గృహం, సాయంత్రం అయిదు గంటల సమయం. 75సం॥ల వయస్సుగల అనంతాచార్య తన గదిలో మంచంపై కూర్చుని వున్నారు. ఇంతలో తలుపు చప్పుడవటంతో వాకిలి వైపు చూశారు. పొడవైన కఫ్నీ ధరించి, తలకు గుడ్డ కట్టుకొని వున్న ఆజానుబాహువు దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న శ్రీ సాయినాథుడు వాకిలి తలుపు తెరచుకొని లోపలికి వస్తున్నారు. ఆయన నేరుగా నడచుకొంటూ వచ్చి అనంతాచార్యులవారి ప్రక్కనే మంచంపై కూర్చున్నారు. శ్రీ అనంతాచార్య దిగ్భ్రాంతు లయ్యారు. అప్పుడు శ్రీ సాయినాథునికి శ్రీ అనంతాచార్యులవారికి మధ్య ఈ క్రింది విధంగా సంభాషణ జరిగింది –

శ్రీ సాయినాథులు చిరునవ్వుతో శ్రీ అనంతాచార్యులవారిని చూస్తూ "వచ్చాను" అన్నారు. ఆశ్చర్యం నుండి కొంచెం తేరుకున్న శ్రీ అనంతాచార్య "మంచిది. ఏమిటిలా వచ్చారు?" అని ప్రశ్నించారు.

శ్రీ సాయినాథులు: రావాలనిపించి వచ్చాను. ఏం? రాకూడదా? రావద్దంటావా?

శ్రీ అనంతాచార్య: మిమ్మల్ని రాకూడదని ఎవరంటారు? మీరు వస్తే మంచిదే కదా! మీ రాక అందరూ కోరదగినదే కదా!

శ్రీ సాయినాథులు : నీ కోసం వచ్చాను. నీ దగ్గరికి రావాలనిపించింది. వచ్చాను.

శ్రీ అనంతాచార్య : నా కోసం వచ్చానంటున్నారు. నేను మీకు ఎన్నడూ పూజ, పునస్కారాలు చేసి ఎరుగను. అటువంటి నా దగ్గరకు రావాలని మీకు ఎలా అన్పించింది?

శ్రీ సాయినాథులు: మంచి హృదయం చూసి నీ దగ్గరకు రావాలనిపించింది.

శ్రీ అనంతాచార్య : అయినా మిమ్మల్ని నిరంతరం సేవించుకొనే వ్యాసు, భరద్వాజ వుండగా వారి దగ్గరకు వెళ్ళకుండా ఎన్నడూ మిమ్మల్ని స్మరించని నా కోసం రావడం ఆశ్చర్యంగా వుంది.

శ్రీ సాయినాథులు: నాకు అటువంటి ప్రాముఖ్యత లేమీ లేవు. నాకు ఎప్పుడు ఎవరి వద్దకు రావాలనిపిస్తే, వారి వద్దకు వస్తాను. నీ సద్గుణాలు, నీ మంచి మనసు వలన నీ దగ్గరకు రావాలని పించింది. వచ్చాను.

శ్రీ ఆవంతాచార్య : అలాగా! చాలా సంతోషం.

శ్రీ సాయినాథులు: నీ కోసం వచ్చాను. నిన్ను విడచి వెళ్ళను. నేను నీ లోపలకు వెళ్ళి ఎప్పుడూ అక్కడే వుండిపోతాను.

అంటూ శ్రీ సాయినాథులు లేచి నిలబడి నవ్వుతూ శ్రీ అనంతాచార్యులవారి భుజాలను తమ బాహువులతో చుట్టి, ఆయనను కౌగలించుకొన్నారు. క్రమంగా శ్రీ సాయినాథుడు సూక్ష్మరూపం దాల్చి నేరుగా ఆయన ఛాతీలోనుండి ఆయన శరీరం లోపలకు వెళ్ళి ఆయన హృదయస్థానంలో లీనమైపోయారు. శ్రీ అనంతాచార్య అంతులేని పారవశ్యంతో స్థాణువులా కూర్చుండిపోయారు. ఆనందాతిరేకంలో ఆయన కన్నులనుండి కన్నీరు ధారలుగా ప్రవించింది. అలా ఎంతోసేపు గడచిన తర్వాత ఆయన బాహ్యస్మృతిలోకి వచ్చారు.

ఆ సన్నివేశాన్నంతా వివరించి ఆ తర్వాత శ్రీ అనంతాచార్య– "భరద్వాజా! ఈ సన్నివేశం తలచుకొన్నప్పుడల్లా నాకు అంతులేని సంతోషానుభూతి కలుగుతుంది. ఆ మితిమీరిన ఆనందంలో ప్రతిసారీ నాకు కళ్ళనీళ్ళొస్తాయి" అంటూ, శ్రీ మాస్టరుగారి కళ్ళలోకి సూటిగా చూస్తూ, విప్పారిన తమ కళ్ళను చిన్న పిల్లవాడిలా అమాయకంగా వేలుతో చూపుతూ "చూడరా! చూడు! నా కళ్ళనుండి ఎలా కన్నీళ్ళు వస్తున్నాయో చూడు!" అన్నారు. మేమంతా వర్షిస్తున్న ఆయన నేత్రాలను విస్మయంతో చూస్తుండిపోయాము.

భగవంతుని ప్రత్యక్ష సాక్షాత్కారాన్ని పొందటమే కాదు, భగవంతుడు తనకై తానే శ్రీ అనంతాచార్యులవారి హృదయంలో ప్రతిష్ఠితమైన అపూర్వ సంఘటనను విన్న తర్వాత సాక్షాత్తూ భగవంతుని తమలో దాచుకొన్న శ్రీ అనంతాచార్యులు తపస్సు ఫలించిన ఋషివర్యునిగా నాకు గోచరించారు. అటువంటి శ్రీ అనంతాచార్యుల వారి స్మరణమే పరమ శుభప్రదం, సకల పాప వినాశకం, వారికి భక్తితో అంజలి ఘటించి ధన్యులమౌదాము.

★★||★★

- సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

బాజిత్ పూర్ లో అమ్మ తన గురించి తాను వ్యక్తపరచుకున్న రోజు అమ్మ మేనమామలైన నిశికాంత్ భట్టాచార్య, జానకీబాబు కూడా అమ్మ యింట్లో వున్నారు. అమ్మ తనకు తాను దీక్షాగ్రహణం చేసుకున్న తర్వాత కొన్ని నెలలపాటు ప్రతిరోజు నియమనిష్ఠలతో జపతపాదులు చేస్తుండేవారు. అవన్నీ పూర్తయిన దాకా అమ్మ మంచినీరు కూడా తీసుకునేవారు కాదు. ఒకరోజు అమ్మ బాహ్యదృష్టిలో లేక, ఒక అలౌకిక స్థితిలో జపతపాదుల అనుష్ఠానంలో నిమగ్నులై వున్నారు. నిశికాంత భట్టాచార్యఆకుటుంబ పెద్దలలోఒకరు. ఆయన ఎదుట శ్రీ భోలానాథ్ గారు కూడా ఎంతో వినయ విధేయతలతో వ్యవహరిస్తారు. శ్రీ ఆనందమయి అమ్మ కూడా పెద్దల ఎదుట మేలి ముసుగు కూడా తొలగనివ్వక ఎంతో విధేయతతో వ్యవహరిస్తారు. ఆ రోజు అమ్మ అనుష్ఠాన సమయంలో ఒక అలౌకికస్థితిలో వున్న సమయంలో ఆమె ఒంటిపై దుస్తులు కూడా అస్తవ్యస్తంగా వున్నాయి. తలపై మేలి ముసుగు కూడా లేదు. అయినా అమ్మలో ఎటువంటి సిగ్గు, సంకోచము వ్యక్తం అవటం లేదు. అమ్మను ఆ స్థితిలో చూసిన నిశికాంత్ గారు కొంత అసహనానికి లోనై భోలానాథ్ గారిని పిలిచి ఆయనతో “ఈమెకు దీక్షా స్వీకరణ వంటివి యేవీ జరగలేదు కదా. అది జరగకుండా యీ జపం, అనుష్ఠానం యెందుకు చేస్తున్నది? దీక్షాగ్రహణం లేకుండా యివన్నీ యేమిటి? ఆమెకు తెలియకపోతే నువ్వైనా చెప్పవచ్చు కదా!” అంటూ కోపంగా గట్టిగా మాట్లాడుతుంటే ఆ మాటలు విన్న అమ్మ వైఖరి ఒకసారిగా మారిపోయింది “ఏమిటిరా! నువ్వు యేమి మాట్లాడుతున్నావురా?” అని అరుస్తుంటే నిశిబాబు అవాక్కై నిలబడిపోయాడు. కోపంతో అమ్మ కళ్ళు యెర్రబారాయి. నిశిబాబు భయంతో గజగజ వణికిపోయాడు. కొంతసేపటికి కొంత తమాయించుకొని చేతులు జోడించి “అసలు మీరెవరు?” అని అడిగాడు. అప్పుడు అమ్మ నోటి నుండి ‘పూర్ణబ్రహ్మ నారాయణుడు’ అన్న మాట వెలువడింది. అప్పుడు భోలానాథ్ గారు కూడా అమ్మ ఎదుటగా వచ్చి నిలబడి “నిజంగా నువ్వు ఎవరో చెప్పు” అన్నారు. ఈసారి అమ్మనుండి ‘మహాదేవి’ అన్నమాట వ్యక్తం అయింది. అందరూ అమ్మను ఆ అలౌకిక స్థితిలో చూస్తూ మైమరిచిపోయారు. ఆ రోజు యెవరూ ఆఫీసులకు కూడా వెళ్లకుండా రోజంతా అమ్మసన్నిధిలోనే వున్నారు. అమ్మతో సంభాషిస్తూ కాలాన్ని మరచిపోయారు. మధ్యలో మరొక చర్చ వచ్చింది. అదేమిటంటే అమ్మ ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా తన గురించి చెబుతున్నారు. ఒకసారి ‘మహాదేవి’ అని మరొకసారి ‘పూర్ణ బ్రహ్మ నారాయణుడు’ అని, యింకొకసారి ‘నారాయణి’ అని – ‘యిలా యిన్ని రకాలుగా చెప్పటానికి గల కారణం యేమిటి?’ అని. ఆ విషయమే వారంతా సూటిగా అమ్మనే

అడగటం జరిగింది. అమ్మ యిలా అన్నారు: "అడిగిన వారి భావాన్ని బట్టి, వారి ఆరాధ్య దైవం, ఆరాధనా విధానాలను బట్టి తగినట్లు జవాబు వెలువబడుతుంది. అంతే!"

షాహ్-బాగ్ లో వుంటున్న రోజులలో ఒకసారి కొందరు భక్తులతో అమ్మ సమీప ప్రాంతంలోని అడవికి విహారానికి వెళ్లారు. అలా తిరుగుతూ తిరుగుతూ వున్న సమయంలో అమ్మకు యెంతో సన్నిహితంగా వుండే గురుప్రియ అనే భక్తురాలు అమ్మను యిలా అడిగింది: "అమ్మా! నిజంగా మీ స్థితి ఏమిటి? అసలు మీరెవరు?" అని. అమ్మ యేమీ మాట్లాడలేదు. అయితే ఆమె ఆ విషయాన్ని విడిచిపెట్టకుండా అమ్మను ప్రశ్నిస్తూనే వుంది. చివరకు అమ్మ గురుప్రియతో కలిసి దూరంగా ఒక ప్రదేశంలో కూర్చున్నారు. వారు కూర్చున్న ప్రదేశంలో వారికి ఎదురుగా ఒక చిన్న చెట్టు వున్నది. ఆ చెట్టు పేరేమిటో తెలియదు గానీ ఆ చెట్టునిండా వంగపండు రంగులో వున్న పండ్లు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. అమ్మ ఆ పండు ఒకదానిని కోసి తెమ్మని గురుప్రియతో చెప్పగా ఆమె పండును కోసి అమ్మ చేతికిచ్చింది. అమ్మ గురుప్రియతో ఒక వేపపుల్లను తెమ్మని చెప్పి ఆ పుల్లతో ఆ పండుకు చిన్న రంధ్రం చేసి ఆ పండులోని నీలిరంగు రసంలో పుల్లను ముంచి గురుప్రియ అరచేతిలో పుల్లతో 'నారాయణి' అని వ్రాశారు. అంతేకాదు, ఈ విషయాన్ని ఎవరికీ చెప్పక గోప్యంగా వుంచమని కూడా అమ్మ చెప్పారు. చాలాకాలం తర్వాత అమ్మ తనకై తానే తన స్థితి గురించి వెల్లడించడం జరిగిన తర్వాత అమ్మ అనుమతితో గురుప్రియ ఆనాడు అడవిలో అమ్మ తన అరచేతిలో తన స్థితి గురించి వ్రాసి చూపించిన విషయం భక్తులకు చెప్పటం జరిగింది. ఆనాడు అమ్మ వ్రాసిన ఆ వేపపుల్లను ఆ పండును తాను పారవేయకుండా యెంతో భక్తితో పవిత్రంగా దాచుకున్నానని అవి కొన్నాళ్లకు బాగా యెండిపోయి వున్నాయని గురుప్రియ భక్తులకు చెప్పింది.

1930 సంవత్సరం. శ్రీ ఆనందమయి మాత జన్మదినోత్సవ వేడుకలు ప్రారంభమైనాయి. వేడుకలు ఆరంభించడానికి ముందే రమణాశ్రమంలో యజ్ఞాగ్ని స్థాపన, కాళీ ప్రతిష్ఠ గురించిన నిర్ణయాలు జరిగాయి. రమణాశ్రమంలోని భూగృహంలో కాళీమాతను స్థాపించి జన్మదినోత్సవం రోజున ఆలయాన్ని తెరవాలని నిర్ణయించారు. ఆ రోజు ప్రాతఃకాలం నుండి పూజలు, సేవలు, నివేదనలు, హారతులు అన్నీ యథావిధిగా జరిపి, అనంతరం మధ్యాహ్నం నుండి కులమత భేదాలు లేకుండా భక్తులందరూ ఆలయ ప్రవేశం చేసి దేవుని సేవించుకోవచ్చని ప్రకటన చేశారు. అదే రోజు సాయంత్రం మరల ఆలయాన్ని శుద్ధిచేసి సూర్యాస్తమయానికి ముందుగానే పూజాదికాలన్నీ పూర్తిచేసి ఆలయం మూసివేయాలని మరల సరిగా సంవత్సరం తర్వాత తెరవాలని అమ్మ ఆదేశించారు.

శ్రీ ఆనందమయి అమ్మ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా భక్తుల కోలాహలం ఆరంభమైంది. ఎందరో కొత్తవారు కూడా పలు ప్రాంతాల నుండి తరలివచ్చారు. యతీష్ దాదా అనే అమ్మ సన్నిహిత భక్తుడు, అతని సోదరులైన నవతర్ దాదా, జ్ఞాన దాదా అనే భక్తులు కుటుంబ సమేతంగా వచ్చారు. ఈ నవతర్ దాదా కాలాంతరంలో అమ్మ విశేషకృపకు పాత్రుడైన భాగ్యశాలి. ఇతడు అమ్మ కోసం పిచ్చివాని వలె పరితపించేవాడు. అవివాహితుడుగా వుండిపోయి అమ్మ ఆశీస్సులతో జీవితాన్ని మోక్ష సాధనకు అంకితం చేసిన అదృష్టవంతుడు నవతర్ దాదా. జ్ఞానదాదా కూడా అవివాహితుడే. అతడు శ్రీ రామకృష్ణపరమహంస సహధర్మచారిణి అయిన శ్రీ శారదామాత వద్ద దీక్షా గ్రహణం చేసి సాధనలో కొంత పరిణితి సాధించాడు. శ్రీ ఆనందమయి అమ్మ పై అతనికి గల ప్రేమ అపారం.

జన్మదినోత్సవ వేడుకలు ఆరంభమైన తరువాత యజ్ఞాగ్ని విషయంలో కొన్ని మార్పులు జరిగాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న హోమగుండంలో రాత్రింబగళ్లు ప్రజ్వరిల్లుతున్న యజ్ఞాగ్నిని ఉద్వాసన క్రియ నిర్వహించి, అంతటితో ఆపివేసి, రమణాశ్రమంలో మరలా కొత్తగా యజ్ఞాగ్నిని రగిలించి దానిని రాత్రింబగళ్లు ప్రజ్వరిల్లుతుండేలాగ యేర్పాట్లు జరిగాయి. అంతేగాక ప్రతిరోజు ఆ హోమగుండం నుండి తీసుకొచ్చిన అగ్నితోనే హోమాదికాలు జరగాలని నిర్ణయించారు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# బుద్ధ ధ్యాన హృదయము

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మానవ మేధస్సు రెండవ దశను యిదివరకే చేరుకుంది. వస్తువుల గూర్చిన విస్తారమైన అవగాహనను సాధించినప్పటికీ అదంతా భ్రాంతిపూరితమైనదే. బుద్ధుడు చెప్పిన సమ్యక్ స్మృతి సాధన లోపించినపుడు కొత్త వివరాలతో మనసును నింపుకుంటాము. వాటిని మానవ ప్రయోజనానికి ఉపయోగించుకుంటామేగాని మన వ్యక్తిత్వంలో పరివర్తన కలుగదు. అలా విజ్ఞానాన్ని అతిగా వాడుకోవడం వల్ల వచ్చే అనర్థాలను మన నాగరికత అప్పుడే చవిచూస్తున్నది. పాక్షికమైన అభివృద్ధి వల్ల జాతి క్షీణం, నాశనము కాలాంతరంలో తప్పవని జీవశాస్త్రం నిరూపిస్తుంది. భౌతికమైన ప్రయోజనాలకు సంబంధించిన మేధాశక్తిని మాత్రమే సుఖాలను, అధికారాన్నీ సాధించుకోవడం కోసం పాక్షికంగా అభివృద్ధి చేసుకోవడమే నేటి మానవుడు చేస్తున్న ప్రమాదకరమైన పొరపాటు. ఒక వంక శరీరాన్ని చంపే విధానాలు, మనస్సును చంపే వినోదాలు దీని పర్యవసానం. బుద్ధుడు చెప్పిన మధ్యేమార్గమే ఈ ప్రమాదాలనుండి మనలను రక్షించగలదు. క్లుప్తంగా చెప్పాలంటే మానవ మేధస్సు రెండవ స్థాయిలోనే చలిస్తూ వున్నట్లైతే మానవ జాతికి ఆ నష్టం తప్పదు. కేవలం సమ్యక్ స్మృతివల్ల మాత్రమే నూతనమైన ప్రగతిని మానవ చైతన్యం పొందగలదు.

"మహాపురుషుడంటే ఎవరు?" అని ప్రశ్నించిన శరిపుత్రునితో బుద్ధుడిలా అన్నారు: "విముక్తి చెందిన మనస్సు కలవాడే మహాపురుషుడు". అయితే మనస్సును ముక్తి చెందించడం ఎలాగ? సాధకుడు శరీరము, భావాలు, వ్యక్తిగత చైతన్యము, మనో విషయాల గురించి నిర్దుష్టంగా తత్వావగాహన చేసుకుంటాడు. అలా జీవించేవాని మనస్సు నిర్మలమై విముక్తిని పొందుతుంది. అలాంటి మనస్సు కలవాడే మహాపురుషుడు. (సంయుక్తనికాయము) బుద్ధుడు దుఃఖ నివృత్తికై చెప్పిన అష్టాంగ విధానంలో 7వ అంశము స్మృత్యుపస్థానము లేక సమ్యక్ స్మృతి.



ఈ సమ్యక్ స్మృతిని నాలుగు లక్ష్యాల వైపు పని చేయించాలి. 1) శారీరకము. 2) అనుభవాలు (feelings) 3) మానసిక స్థితి లేక చైతన్య స్థితి 4) నిర్దుష్టమైన మానసిక అంశాలు లేక చైతన్య అంశాలు. సమ్యక్ స్మృతి వల్ల కలిగే సరియైన అవగాహనను సంప్రజ్ఞ అంటారు. సమ్యక్ స్మృతి అనేది సాధనలోని మానసిక వైఖరిని సృష్టిస్తుంది. ఒక పనిచేయవలసి వచ్చినపుడు దానిపై మనకుండవలసిన సరియైన అవగాహనను సూచిస్తుంది 'సంప్రజ్ఞ' అనే పదము.

- సశేషం

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి స్వాతి, గుంటూరు

నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటన లోనూ బాబా అనుగ్రహం వుంది. ఆయనే నా జీవితంలో ప్రవేశించకపోతే నేను ఏమైపోయేదాన్నో అనిపిస్తుంది. ఆయన అనుగ్రహం ఏదో అద్భుతంలాగా కాకుండా, నిరంతరం నా చేయిపట్టి నడిపించే విధంగా వుంటుంది.

నాకు 15 సంవత్సరాల వయస్సప్పుడు మా అమ్మకి తలలో నరాలకు సంబంధించిన సమస్యలు వచ్చాయి, దానితో వైద్యులు ఆవిడకి అకస్మాత్తుగా ఏదైనా జరిగే ప్రమాదముందని, బాధ్యతలుంటే తొందరగా తీర్చేసుకోమనీ చెప్పారు. నాకు అప్పుడు పెళ్లి చేసేసారు. 18 వ సంవత్సరంలో నాకు పాప పుట్టింది. అయితే అంతకు ముందు సంవత్సరంలో అబార్షన్ అవడం వల్ల చాలా భయపడి, బాధపడేదాన్ని. అప్పుడు మా ఇంటి దగ్గర శేషమ్మ గారని ఒక ఆంటీ ఉండేవారు. ఆవిడ శ్రీగురుచరిత్ర, శ్రీసాయిలీలామృతము గ్రంథాలు నాకు ఇచ్చి 'వీటిని సప్తాహ పారాయణ చేయమ్మా. తప్పకుండా నీ కోరిక నెరవేరుతుంది' అని చెప్పారు. నేను అలాగే పారాయణలు మొదలుపెట్టాను. శ్రీ సాయిలీలామృతము సప్త సప్తాహాలు పారాయణ చేస్తున్నప్పుడు గర్భవతిని అయ్యాను. చిన్నవయసు అవడం వల్ల ఈసారి కూడా గర్భం నిలవదేమోనని వైద్యులు అభిప్రాయపడ్డారు. 3వ నెలలో ఆసుప్రతిలో చేరి కొన్నాళ్ళు వుండవలసి వచ్చింది. అప్పుడు నేను చాలా బాధపడ్డాను. ఆ సమయంలో శ్రీ శిరిడీ సాయినాథులవారు నాకు స్వప్నదర్శనం ఇచ్చి "ఎందుకమ్మా అలా బాధ పడతావ్, నీకేమీ అవదు నీ బిడ్డను నేను చూసుకుంటాను" అని హామీ ఇచ్చారు. బాబా నాకు అలా స్వప్నంలో భరోసా ఇవ్వడం వల్ల, నేను చాలా ధైర్యంగా ఉండి పారాయణ మాత్రం వదలకుండా చేసుకుంటూనే ఉండేదాన్ని. కాన్పుకి ప్రైవేట్ ఆసుపత్రిలో అయితే డబ్బులు ఎక్కువ అవుతాయి. మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అంత పెట్టుకోవడం కష్టమని ఆలోచిస్తున్నాము. ఆ సమయంలో, అమ్మ సత్సంగానికి ఒకరి ఇంటికి వెళితే, అక్కడికి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే స్త్రీ వైద్య నిపుణులు వచ్చారు. ఎవరితోనో అమ్మ మా పరిస్థితి చెప్తుంటే ఆవిడ విని, తనను తను పరిచయం చేసుకుని, తాను పనిచేసే ఆసుపత్రిలోనే నాకు కాన్పు జరిగే అవకాశాన్ని కల్పించారు. ఇదంతా బాబా అనుగ్రహం కాక ఇంకేమిటి? నేను కాన్పు కోసమని ఆసుపత్రిలో చేరగానే, మా చుట్టాలు శిరిడి వెళ్లి వచ్చి, నాకు ప్రసాదం ఇచ్చిన వెంటనే కాన్పు జరిగింది. చక్కటి ఆడపిల్ల పుట్టింది. ఇదంతా బాబా అనుగ్రహం!! నాకు స్వప్నంలో మాట ఇచ్చినట్టుగానే, నన్ను అడుగడుగుకి కాపాడుతూ, 2004 డిసెంబర్ లో పాపని ప్రసాదించారు.

తర్వాత కొన్ని సంవత్సరాలకి 2015 లో మా నాన్నగారికి ఆరోగ్యం బాగాలేదు. చాలా మంది వైద్యుల దగ్గర చూపించాం కానీ ఎక్కడా నయం కాలేదు. చివరికి ఆయనకి 'బ్లడ్ క్యాన్సర్' అని, ఇంక ఎక్కువ కాలం బ్రతకరని

వైద్యులన్నారు. నాకు పిల్లలు పుట్టిన తర్వాత వైవాహిక జీవితంలో కొన్ని సమస్యలు వచ్చాయి. ఆ సమయంలో మా నాన్నగారే నాకు అండదండగా నిలిచారు. అలాంటిది ఆయన లేకపోతే ఎలాగ? అనిపించింది. ఒకరోజు బాబా దగ్గర బాగా ఏడ్చి, మా నాన్న పరిస్థితి ఏమిటని బాబాని అడుగుతూ, శ్రీ సాయిలీలామృతము గ్రంథం తెరిచాను. తెరవగానే 'సద్గతి' అధ్యాయం వచ్చింది. ఇంక నాకు అర్థమైపోయింది ఏం జరుగుతుందో! విపరీతంగా బాధపడ్డాను దీన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించమని బాబాని ప్రార్థించాను. తరవాత మేము కృష్ణమాచారిగారి హోమియో మందు దగ్గర తీసుకున్నాము. ఆ వైద్యంతో మా నాన్నగారు 14 నెలలు బ్రతికారు. పైగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిలా మాతో కలసి వున్నారు. అయితే ఆయన ఇక కొన్ని రోజులకి కాలం చేస్తారనగా ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో "దత్తస్వామి ముందు నడుస్తున్నారు. వెనకాల నాన్నగారిని నలుగురు మోస్తున్నారు. ఆ వెనక బాబా చాలా మాములుగా నడుస్తున్నారు. వీళ్ళందరూ మా ఇంటి దగ్గర వుండే నాగసాయి మందిరం లోకి వెళ్లారు. మేమందరం ఆ గుడికి వెళ్లి సేవలు చేసుకుంటూ వుంటాము. అక్కడికి వెళ్ళాక, దత్తస్వామి తన విగ్రహంలో లీనమైపోయారు. మా నాన్నగారూ దత్తస్వామి విగ్రహంలోకి వెళ్లిపోయారు. ఆ వెనకనే బాబా తన విగ్రహంలో లీనమైపోయారు. ఈ స్వప్నం తరువాత మా నాన్నగారికి బాబా సద్గతి కలిగిస్తారని నాకు ఊరట కలిగింది.

ప్రారంభంలో నేను చిన్న చిన్న పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా చేసేదాన్ని. తరవాత పెద్ద పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా స్థిరపడ్డాను. ఇక్కడ నాకు బాబా చేసిన ఇంకొక మేలు ఏమిటంటే, ఎన్నో సంవత్సరాల క్రితమే చనిపోతుందనుకున్న మా అమ్మని బ్రతికించి, నా పిల్లలకి అండగా వుంచారు. అందువల్ల నేను ప్రశాంతంగా ఉద్యోగం చేసుకోగలుగుతున్నాను.

నా ఇంటి పరిస్థితులు ఇలా చక్కబెడుతూ, నేను పనిచేసే స్కూల్లో నాకు వచ్చిన సమస్యలను కూడా బాబా పరిష్కరించి నన్ను కాపాడారు. అందులో ఒక సంఘటన,,,, 2022 వ సంవత్సరంలో జరిగినది మీతో పంచుకుంటాను. 9వ తరగతి పిల్లలకి విజ్ఞానశాస్త్రం పరీక్ష అయిపోయాక వాళ్ళ పేపర్లు దిద్ది అలమరాలో పెట్టాను. మరునాడు వాటిని ప్రధానాధ్యాపకులకి ఇవ్వాలని చూస్తే నేను పెట్టిన చోట ఆ పేపర్లు లేవు. నాకు చాలా భయమేసింది.

నా తోటి ఉపాధ్యాయులందరూ నాకు ధైర్యం చెప్తున్నారు. నన్ను ఆ పాఠశాలలో అందరూ చాలా అభిమానిస్తారు. వాళ్ళందరూ ఎక్కడ పెట్టావో చూసుకో అంటూ సలహాలు సూచనలు ఇస్తున్నారు. నా స్వవిషయం అయితే అంత బాధ ఉండేదికాదు. 9వ తరగతి పిల్లలు 10వ తరగతిలోకి వెళ్లాలంటే ఆ పేపర్లు వుండాలి. నాకు 3 రోజులు సమయం యిచ్చారు అయినా దొరకలేదు. 'బాబా నువ్వే నాకు శరణ్యం' అని శ్రీ సాయిలీలామృతము సప్తాహ పారాయణ మొదలుపెట్టాను. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. ఎవరికో సి సి కెమెరా చూడాలన్న ఆలోచన వచ్చింది. అందులో కనిపించిన దృశ్యం చూసి మేమందరం చాలా ఆశ్చర్యపోయాము. నాతో పని చేసే ఇంకో ఉపాధ్యాయురాలు నాపై ద్వేషం వల్ల, ఆ పేపర్లని తీసి దూరంగా ఉన్న చెత్తబుట్టలో పడేసింది. ఇదంతా సి సి కెమెరాలో నమోదు అయింది. ముందు నుంచి కూడా నన్ను ఎలాగైనా ఉద్యోగంనించి తొలగింప చెయ్యాలని, నన్ను ఇబ్బంది పెట్టాలని చాలా ప్రయత్నాలు చేస్తున్నారు ఆవిడ. విషయం అందరికి అర్థమయ్యాక, నేను తేలికగా ఊపిరి పీల్చుకున్నాను. ఒక్క సప్తాహ పారాయణ, ఎక్కడెక్కడో కదలికలు తెచ్చింది. ఆమెని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించారు. బాబా నన్ను అనుగ్రహించి నాకు నా పిల్లలకి భుక్తిని ప్రసాదించారు.

ఈమధ్య అంటే ఫిబ్రవరి నెలలో మా ఇంట్లో దొంగతనం జరిగింది. మేము శ్రీరాంనగర్ లో వుంటాము. అసలు మా కాలనీకి దొంగల భయమేలేదు. రోజూ మా ఇంట్లో అలవాటు ఏంటంటే – భోజనాలు అయిపోయిన తర్వాత నేను, పిల్లలు, అమ్మ అందరం కూర్చుని కాసేపు బాబా గురించి మాస్టరుగారి గురించి మాట్లాడుకుని అప్పుడు నిద్రపోతాం. అది ప్రతిరోజు జరుగుతుంది. ఆ రోజు మాకు తెలిసిన వారి ఇంట్లో కార్యక్రమానికి వెళ్లొచ్చాము. కొద్దిగా ఆలస్యం అయింది. అయినాసరే కాసేపు కూర్చుని బాబా గురించి మాట్లాడుకుంటూ, చాలా ఆలస్యంగా నిద్రపోయాము. గాలి కోసమని కిటికీ మొత్తం తెరిచి పెట్టాము. దాని ద్వారా

***మిగతా 29వ పేజీలో***

# ఆచార్యుని అద్భుత లీలలు


**_శ్రీమతి శేషమ్మ, ఒంగోలు_**

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని ఒంగోలు వాస్తవ్యురాలు శ్రీమతి శేషమ్మగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను పూజ్యశ్రీ మాస్టరుగారి మందిరంలో సుమారు 18 సంవత్సరాలనుంచి సేవ చేసుకుంటున్నాను. మొదట్లో మా ఇల్లు మందిరానికి దగ్గరగా వుండేది. ఒకరోజు ఉదయమే వ్యాయామంగా నడక మొదలుపెట్టి గుడివైపుకు వచ్చాను. అక్కడ కొంతమంది అమ్మాయిలు మందిరంలో సేవచేస్తున్నారు. నన్ను కూడా పువ్వులు కోయమని, వాకిలి చేయమని సేవ చెప్పారు. ఇక అప్పటినుంచి వాకింగ్ మానేసి ఉదయమే 4 గంటలకు అందరమూ పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర సేవ చేసుకునేవారము. ముందు బాబా గుడిలో సేవకు వచ్చాను. తరవాత పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం సేవ మొదలుపెట్టగానే ఆయనంటే నాకు బాగా ఇష్టం ఏర్పడిపోయింది. ఇంట్లో అన్నీ ప్రతికూల పరిస్థితులున్నప్పటికీ నేను ఉదయమే ఆ సేవకు వెళ్లకుండా వుండలేను. నేను ఏమీ చదువుకోలేదు. కనుక పారాయణ చేయలేను. ఈ సేవ ఒక్కటే నేను చేయగలిగింది.

రోజూ నామం చెప్పుకుంటూ సేవ చేస్తాను. ఆ నామం చెప్తుంటే నాకు చాలా శక్తి వచ్చినట్లుంటుంది. చదువు రాదు కనుక కష్టపడి సమాధిమీద పువ్వులతో 'సాయి మాస్టర్' అని వ్రాయడం నేర్చుకున్నాను. ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు ఒంగోలు వచ్చారు. అప్పుడు వారి దర్శనానికి వెళ్లాను. పూజ్యశ్రీ అమ్మగారు నన్ను దగ్గరకు పిలిచి, నేను ఏమేమి సేవలు చేస్తానో, ఎన్ని గంటలకు సేవకు వెళతానో అడిగారు. అన్నీ చెప్పాను. సమాధిపై అలంకరణ గురించి అడిగి, 'సాయి మాస్టర్' కాదు, 'శ్రీ సాయి మాస్టర్' అని వ్రాయమన్నారు. అప్పటినుంచి అదేవిధంగా వ్రాస్తున్నాను.

ఒకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు శివపార్వతులలాగా దర్శనమిచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు త్రిశూలం పట్టుకుని వున్నారు. పక్కనే పూజ్యశ్రీ అమ్మగారు ఆకుపచ్చ చీర కట్టుకుని పసుపురాసుకున్న పచ్చటి పాదాలతో



దర్శనమిచ్చారు.

సమాధికి సేవ చేస్తుంటే రెండు మూడుసార్లు కరెంటు షాక్ కొట్టినట్లైంది. కరెంట్ ఏమైనా పెట్టారేమోనని తోటి సేవకులను అడిగాను. "కరెంట్ ఏమీ లేదు. అలా పూజ్యశ్రీ మాస్టర్ గారు నీకు ఆశీస్సులిచ్చారు!" అన్నారు.

ఒకరోజు సేవకి వచ్చేసరికి రాత్రి వేసిన తెల్లటి వస్త్రం పాదాలుండేచోట కుడివైపు మూలకి తడిసివుంది. అక్కడనుంచి నీళ్లు కారుతున్నాయి. కారణమేమిటని చాలా పరిశీలనగా అంతా చూశాను. కానీ ఏమీ

తెలియలేదు. నేను ఆ తీర్థాన్ని తీసుకున్నాను. అలా రెండు మూడుసార్లు జరిగింది. అప్పుడు నాతోపాటు ఇంకొంతమంది వున్నారు. అందరమూ ఆ తీర్థాన్ని తీసుకున్నాము. అది పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రసాదతీర్థమే!

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారికి బొట్టు పెడుతుంటే ఆ అద్దంలోనుంచి నా వెనుక ఎవరో నిలబడినట్లు కనిపించింది. 'ఇంత పొద్దున్నే ఎవరొచ్చారబ్బా?' అనుకుంటున్నాను. 'బొట్టు పెడుతున్నాను కదా' అని నేను కదలలేదు. అతనెంతటికీ వెళ్లకపోతే పక్కకి జరిగాను. అతను ఎప్పుడూ గుడికి వచ్చేవాడే! కొంతసేపటికి.. అంటే ఉదయం 5:30 గంటల సమయంలో అతనొచ్చాడు! "ఇందాకే కదా వచ్చావు! మళ్ళీ వచ్చావేమిటి?" అని అడిగాను. "ఇందాక రావటమేమిటి? నేను ఇప్పుడే వస్తున్నాను!" అన్నాడు. నేను ఆశ్చర్యపోయి జరిగినదంతా చెప్పాను. "అయితే పూజ్యశ్రీ మాస్టరుగారే నీకు దర్శనం ఇచ్చివుంటారు!" అన్నాడు. నాకు చాలా ఆనందం కలిగింది. ఒకొక్కసారి సమాధినుంచి ఓంకారం వినిపిస్తుంది. సంతోషంతో నమస్కారం చేసుకుంటాను.

మేము ఇప్పుడు సుందరయ్య భవన్ దగ్గర ఇల్లు కట్టుకుని వచ్చేశాము. మా ఇల్లు మందిరానికి కొంచెం దూరం. ఇదివరకు విన్నకోటలో వున్నప్పుడు సేవనించి వచ్చాక, మా ఇంటినుంచి టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్.. అన్నీ పూజ్యశ్రీ మాస్టరుగారికి నివేదన పంపించేదాన్ని. ఇప్పుడు దూరం కావడం వల్ల పంపించలేకపోతున్నాను. ఇక్కడనుంచి దూరమని, తెల్లవారుఝామున ఒంటరిగా వెళ్లవద్దనీ ఇంట్లో గొడవ చేస్తారు. అయినా ఆగలేను. ఇప్పుడు ఆటోలో వెళుతున్నాను. అంత ఉదయమే ఇంటిదగ్గరే ప్రతిరోజూ ఆటో దొరుకుతుంది!!

నాతో కూడా మా ఇంటినించి రోడ్డుమీద వరకూ రెండు కుక్కలు వస్తాయి. ఒకసారి ఆటో కోసం నిల్చున్నాను. నా ముందునుంచి ఒక ఆటో నేను ఆపమంటున్నా ఆపకుండా వెళ్ళిపోయాడు. కొంతసేపట్లోనే వెనుకకు వచ్చి ఆటో ఎక్కించుకున్నాడు. నన్ను గుడి దగ్గర దింపి నాతో ఇలా చెప్పాడు. "నేను మిమ్మల్ని దాటుకుని కొంచెం ముందుకు వచ్చాక నా చెవిలో ఎవరో, 'అక్కడ పూలు పట్టుకుని నిల్చుని ఒకావిడ వుంది కదా? ఆవిడను ఎక్కించుకో!' అని మూడుసార్లు చెప్పారమ్మా. అందుకే వెనక్కి వచ్చాను" అన్నాడు! నాకు పూజ్యశ్రీ మాస్టరుగారిమీద కృతజ్ఞతతో కళ్ళవెంట నీళ్లు వచ్చాయి.

ఇంతలా నన్ను పట్టించుకుంటున్న నా తండ్రి దగ్గరకు రాకుండా నేను ఎలా వుండగలను?

ఒకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, "నాకు తలకి స్నానం చేయించు!" అని అడిగారు. విగ్రహరూపంలో పూజ్యశ్రీ మాస్టరుగారున్నారు. నేను తలస్నానం చేయించడం మొదలుపెట్టాక పూజ్యశ్రీ మాస్టరుగారిలాగా మారిపోయారు. వారికి తలంటిపోసి, తల దువ్వి , బ్రూ కాఫీ ఇచ్చాను. చిన్నపిల్లవాడికి తల్లి చేసినట్లు అనిపించింది నాకు!

ఒకసారి స్వప్నంలో సమాధిలో వున్న పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించారు. బాగా సన్నగా అయిపోయి చాలా పెద్దాయనలా వున్నారు. వారికి నా చెయ్యి అందించి లేపమంటున్నారు. అదీ స్వప్నం!

మందిరంలో అప్పుడప్పుడూ ధ్యానం చేసుకుంటూ వుంటాను. అలా ఒకసారి మందిరంలో ధ్యానం చేస్తూ వుండగా నేను సమాధిలోకి వెళ్ళిపోతున్నట్టు అనిపించింది. నేను చనిపోతానేమోనని భయం కలిగి పూజ్యశ్రీ మాస్టరుగారితో, "మాస్టరుగారూ! నాకు బాధ్యతలున్నాయి కదండీ! చనిపోతే ఎలా?" అన్నాను. అలా అన్నానో లేదో! వెంటనే నేను బయటకొచ్చేశాను! నిజంగానే త్వరలో నాకు ప్రాణాపాయస్థితి వచ్చింది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారే నాకు ఏమీ కాకుండా కాపాడారు.

ఇలా అనుక్షణం నా వెంటవుండి కాపాడే నా తండ్రి సేవ నా ఊపిరి వున్నంతకాలం చేసుకోగలగాలని కోరిక. అలా చేసుకోలేని రోజుల్ని నా ఊహలో కూడా భరించలేను. నా చుట్టూ ఎన్నో సమస్యలున్నప్పటికీ, వారు నాపై చూపించే ప్రేమాదరణలతో వాటిని ఎదుర్కోగలుగుతున్నాను. నిరంతరం వారి సేవ, స్మరణలతో జీవితం గడపాలని పూజ్యశ్రీ మాస్టరుగారిని వేడుకుంటూ పాదాభివందనాలు తెలియచేసుకుంటున్నాను.

ఓం ఆశ్రితవత్సలాయ శ్రీ భరద్వాజ సద్గురవే నమః!

జై సాయి మాస్టర్!!

# మాతృదేవి స్మృతులు

13వ పేజీ తరువాయి

టెంట్లో వుండేవాళ్ళం. ఇంకా పూర్తిగా షెడ్ లోకి మారలేదు. ఆ రోజు టెంట్ పడిపోయింది. వానంతా వెలిశాక వెళ్ళి చూస్తే పూజ్యశ్రీ అమ్మగారి పెద్ద ఫోటో పగిలిపోయింది. నాకు చాలా బాధ కలిగింది. అదేరోజు రాత్రి పూజ్యశ్రీ అమ్మగారు స్వప్న దర్శనమిచ్చి, "ఏం ఫరవాలేదులే! బాధపడకు" అన్నారు! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. పూజ్యశ్రీ అమ్మగారు నన్ను ఎంతగా కనిపెడుతూ వున్నారో అర్థమైంది.

నేను ప్రతిరోజూ ఉదయమే నిద్రలేవగలగడం పూజ్యశ్రీ అమ్మగారి దయ. పగలంతా పనులతో తిరగడంవల్ల అలిసిపోయి బాగా నిద్రపోయేవాడిని. అందువల్ల ఉదయం హారతికి ఏర్పాటు చేయడానికి మెలకువ వచ్చేది కాదు. కానీ ఆ సమయానికి ఎవరో తట్టి లేపినట్లు లేచేవాడిని! అలా నేను చక్కగా ఉదయహారతి చేసుకునేలా అనుగ్రహించారు పూజ్యశ్రీ అమ్మగారు.

పూజ్యశ్రీ అమ్మగారు నన్నే కాదు, మా ఇంటి పరిస్థితులను కూడా చక్కదిద్దారు. మా నాన్నగారికి చాలా జబ్బు చేసింది. "ఆక్సిజన్ లెవెల్స్ బాగా తగ్గిపోయాయి" అన్నారు వైద్యులు. చాలా ఆసుపత్రులకు తిరిగాం. సాయంత్రానికి ఒక ఆసుపత్రిలో చేర్చుకున్నారు. అంతా సర్దుబాటు జరిగేసరికి రాత్రి అయింది. అదేరోజు అర్ధరాత్రి ఒంటిగంటకు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి వచ్చి ప్రదక్షిణలుచేసి, మా నాన్నకి జబ్బుతగ్గి ఇంటికి వస్తే ఒక రోజంతా ప్రదక్షిణలు చేస్తానని మొక్కుకుని వెళ్లాను. ప్రతిరోజూ అమ్మగారి అభిషేకజలం తీసుకెళ్లి త్రాగించేవాడిని. కొన్నిరోజులకు పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల మా నాన్నకి ఆరోగ్యం బాగుపడింది.

పూజ్యశ్రీ అమ్మగారికి మొక్కుకున్నట్లుగానే, నేను ఒకరోజు ఉదయమే 7 గంటలకి మొదలుపెట్టి, రాత్రి 7 గంటలవరకు భోజనానికి కూడా వెళ్లకుండా ప్రదక్షిణలు చేశాను. డాక్టర్లే బ్రతకడు అని చెప్పిన మనిషిని పూజ్యశ్రీ అమ్మగారు బ్రతికించారు!

ఇక్కడ ప్రతి క్షణం లీలే! అన్నిటికీ పూజ్యశ్రీ అమ్మగారే మాకు దిక్కు. ఇక్కడ విపరీతమైన విపత్కర పరిస్థితులు వస్తాయి. కానీ అంతలోనే పరిష్కరింపబడతాయి! నాకు మాత్రం 'నేను ఎప్పటికీ అమ్మ సన్నిధిలోనే వుండాలి!' అని చాలా గాఢంగా అనిపిస్తూ వుంటుంది. నేను అనుకోవడం కన్నా పూజ్యశ్రీ అమ్మగారి దయ వుంటే తప్పకుండా నా కోరిక నెరవేరుతుందని నా నమ్మకం. పూజ్యశ్రీ అమ్మగారి సంపూర్ణ కరుణాకటాక్షాలు నాపై వర్షించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పాదాభివందనాలు సమర్పిస్తున్నాను.

ఓం భక్తిప్రదాయై నమః!

# ద్వారకామాయి అనుభవ మంటపము

26వ పేజీ తరువాయి

తలుపు తీసుకుని ఒక దొంగ లోపలకి వచ్చాడు. మేము చాలా గాఢంగా నిద్రపోయాము. తెల్లవారుతూనే నేను బాబా గుడికి కాకడ హారతికి వెళ్ళిపోయాను. తిరిగి వచ్చేసరికి మా పక్కింటి వాళ్ళు నా బాగ్ వాళ్ళింట్లో పడివుందని తెచ్చియిచ్చారు. అందులో ముఖ్యమైన పేపర్లు అన్నీ గోడబైట పడేసి, దానిలో చరవాణి (సెల్ ఫోన్) తీసుకుని, బ్యాగు వాళ్ళింట్లో విసిరేసి వెళ్ళిపోయాడు. నా ఫోను పెద్ద ఖరీదైనది కాదు. కానీ నాకు ఆశ్చర్యం ఏమిటంటే, ముందురోజు బైటకి వెళ్ళివచ్చాము కదా, మెడలో వేసుకున్న బంగారు గొలుసులు రెండు టేబులు పైనే ఉన్నాయి, పక్కనే రెండు లాప్ టాప్ లు వున్నాయి. ఇవన్నీ వదిలేసి ఫోనొక్కటీ పట్టుకెళ్లడం చాలా ఆశ్చర్యమేసింది. అంటే దొంగతనం జరగాల్సిన పరిస్థితి ఉంది కానీ చాలా తక్కువలో అది జరిగేటట్టు బాబా అనుగ్రహించారు అని అనిపించింది. ఇలా ప్రతిక్షణం మమ్మల్ని ఎంత జాగరుకులై కాపాడుతున్నారో తలచుకుంటే కృతజ్ఞతతో కళ్ళు చెమర్చకుండా వుండవు. ఇంతటి అనుగ్రహాన్ని కురిపిస్తున్న వారికి ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేను,,, అంజలి ఘటించి పాదాభివందనం చేయడం తప్ప!!

జై సాయి మాస్టర్!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే
# రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |


### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |





Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



మార్చి 5, 6 (2024) తేదీలలో మన గురు దంపతులైన పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి మరియు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ ల లీలా కళ్యాణ మహోత్సవము ఒంగోలు సమీపంలోని సంత నూతలపాడు మండలం, గుమ్మళంపాడు గ్రామ శివారులో గల 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము' లో భక్తి జ్ఞాన ప్రబోధాత్మకంగా, అత్యంత వైభవంగా, కన్నులపండుగగా జరిగింది.



IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.